ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 26 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 39 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

హెచ్-1బీ వీసాలపై

## ట్రంప్ యంత్రాంగం అక్కసు

మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన

సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ

2






ఏఐతో ఉన్న భయాలు

## తొలగించాలి

అపోహలు తొలగిస్తేనే భవిష్యత్

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు

2

## స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి

పవన్ కల్యాణ్ సీరియస్

ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరించేవారిని ఉపేక్షించబోమని పవన్ హెచ్చరిక

కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం

స్మగ్లర్లకు సహకరించిన బీట్ ఆఫీసర్ అరెస్ట్

అధికారి పాత్రపై లోతైన విచారణకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం

2



## రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా

వేదవతిని త్వరగా పూర్తి చేసి లిఫ్ట్ చేస్తాం

జొన్నగిరిని స్వర్ణగిరిగా మారుస్తాం

రాయలసీమ స్కిల్స్‌తో యువతకు ఉపాధి కల్పిస్తా

కర్నూలు పర్యటనలో సిఎం చంద్రబాబు

2



సామాన్యుడిలా

## ప్రజల మధ్యే ఉంటా

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం

వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం

ఆస్పత్రిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

2



ఇది ముమ్మాటికీ

## విద్యార్థుల విజయం

2

గాంధీ నుంచే మేం శాంతిని నేర్చుకున్నాం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై25 (సింగిడి):** నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్సలో పోస్ట్ చేసింది.



విద్యార్థులే నిజమైన

## దేశభక్తులు

ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్

రాహుల్, ప్రియాంకల హర్షం

2

ముగిసిన రాజకీయం..

# మిగిలిన పరిష్కారం

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా

### పోరాటం ఆపిన జెన్ Z వర్గం

కేంద్రం సీజేపీ డిమాండ్లకు అంగికారం తెలిపింది

అధికార పక్షం నైతిక విజయాన్ని ప్రకటించింది

ప్రతిపక్షం ప్రజా పోరాట ఫలితమని చెప్పింది

వ్యవస్థ మార్పుకోసం విద్యార్థుల నిరీక్షణ యధాతథం



ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అంతకుముందు సీజేపీ ముందుంచిన ప్రధాన డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించడం, ఆ వెంటనే మంత్రి రాజీనామా జరగడం రాజకీయ చర్చకు కొత్త మలుపు ఇచ్చింది. అధికార పక్షం దీనిని బాధ్యతాయుత నిర్ణయంగా చెబుతుంటే, ప్రతిపక్షం మాత్రం ప్రజల ఒత్తిడి, విద్యార్థుల ఉద్యమం, తమ రాజకీయ పోరాటమే కేంద్రాన్ని నిర్ణయం తీసుకునేలా చేసిందని వాదిస్తోంది.

(స్పెషల్ కరస్పాండెంట్

**సీజేపీ గెలుపు... రాజకీయ జయానికి కొత్త అర్థం**

సీజేపీ కోరిన అంశాలపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్షం తమ పోరాటం ఫలించిందని ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వం మాత్రం ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకున్నామని చెబుతోంది. దీంతో ఒకే పరిణామాన్ని రెండు రాజకీయ పక్షాలు తమ విజయంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

**సంస్కరణలతోనే విద్యార్థుల అసలు విజయం.....**

ఈ మొత్తం పరిణామంలో కేంద్రబిందువు విద్యార్థులే. వారికి కావాల్సింది రాజకీయ విజయాలు కాదు. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా జరిగే పరీక్షలు, ప్రశ్నాపత్రాల భద్రత, బాధ్యులపై కఠిన చర్యలు, భవిష్యత్తుపై నమ్మకం. ఈ అంశాలు అమల్లోకి వచ్చినప్పుడే ఈ పోరాటం విద్యార్థుల విజయంగా నిలుస్తుంది.
రాజకీయాలు తమ విజయాన్ని ప్రకటించుకోవచ్చు. డిమాండ్లు నెరవేరినట్లు చెప్పుకోవచ్చు. కానీ ప్రజల తీర్పు మాత్రం ఫలితాల ఆధారంగానే ఉంటుంది. విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి గెలుచుకున్న రోజే ఈ మొత్తం పరిణామం పూర్తి అర్థం పొందుతుంది. సీజేపీ డిమాండ్లను కేంద్రం అంగీకరించింది... మంత్రి రాజీనామా చేశారు... కానీ పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసం పునరుద్ధరించిన రోజే ఈ పోరాటానికి నిజమైన విజయం దక్కినట్లవుతుంది.

**రాజకీయ విజయాలు సరే...వ్యవస్థపై తీర్పు సంగతేంటి ?**

రాజకీయంగా ఈ పరిణామం ఎవరికైనా అనుకూలంగా ఉండొచ్చు. కానీ ప్రజల దృష్టిలో అసలు ప్రశ్న మాత్రం వేరే ఉంది. డిమాండ్లు అంగీకరించడం, మంత్రి రాజీనామా చేయడం తర్వాత పరీక్షా వ్యవస్థలో ఏమేరకు మార్పు వస్తుంది? తప్పులు పునరావృతం కాకుండా ఏ సంస్కరణలు అమలవుతాయి? అన్నదే ఇప్పుడు కీలకం.



2

జంతర్ మంతర్

## ఆందోళనకు ముగింపు

కేంద్రమంత్రులతో సిజెపి ప్రతిధుల చర్చలు ఫలప్రదం

విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం

భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు.

న్యూఢిల్లీ,జులై 25 (సింగిడి)

ప్రహ్లాద్ జోషికి

## విద్యాశాఖ అప్పగింత

ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్జ్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు.

- న్యూఢిల్లీ,జూలై25 (సింగిడి)



రియల్ ఎస్టేట్ రంగంపై

## గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి

త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు

రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



2

**హైదరాబాద్, జులై 25 (సింగిడి):** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

ప్రారంభించిన మంత్రి పొంగులేటి

2



అధికారంలో ఉన్నవారి కంటే

## ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్

2



ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే

## ప్రజాస్వామ్యం

బండి సంజయ్

2

చట్టసభల వయోపరిమితి

# 21 ఏళ్లకు తగ్గించాలి

## అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి

తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

*చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు.*

హైదరాబాద్, జూలై 25 (సింగిడి)



నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ

- మిగతా 2లో

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
26 జులై 2026

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు



నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఢిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎO-లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్దమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మోహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

**హైదరాబాద్,జులై 25 (సింగిడి):**

క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ప్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ప్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్దిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.



## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

ప్రధాన్ రాజీనామాతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

**న్యూఢిల్లీ,జులై 25 (సింగిడి):**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోకసేభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



## సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

**కర్నూలు,జులై 25 (సింగిడి):**

తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొOల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా

**కర్నూలు, జులై 25 (సింగిడి)**

కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాయలసీమ ప్రగతి, తీవ్రమవుతున్న ఆర్థిక, నీటి సంక్షోభాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాయలసీమను 'రత్నాల సీమ'గా మారుస్తామని సీఎం ఆకాంక్షించారు. వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి, హంద్రీ-నీవా నుంచి నీటిని లిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్‌తో దానికి 'స్వర్ణగిరి'గా పేరు మార్చామని, 2028 మార్చి నాటికి 'రాయలసీమ స్టీల్స్' అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పుట్టపర్తి కేంద్రంగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను తీసుకొస్తామని, అలాగే రాయలసీమను రూ. లక్ష కోట్లతో 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది పోలవరం పనులు పూర్తి చేసి, 2027 మార్చి నాటికి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధ పరిణామాల వల్ల గ్యాస్, పెట్రోల్ సరఫరా తగ్గి రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం 51 శాతం తగ్గడం వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని చెప్పారు. అందుకే ఈ ఏడాది రైతులు వరి పంట వేయవద్దని, ఆరుతడి పంటలు, పండ్లు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. అలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిపై సీఎం ఆరా తీశారు. నీటి సరఫరాలో ఆలూరు 18 శాతం వెనుకబడి ఉందని సభలో ప్రజలు చెప్పగా, సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, జంక ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. దంపతులు కూడా ఒకే ఇంట్లో ఉంటూ ఫోన్లకే పరిమితం కావడం సరికాదన్నారు. Oాష్ట్రంలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందంటూ సీఎం మండిపడ్డారు. బాబాయిని గొడ్డలితో చంపి, ఆ నిందను తనపై వేసేందుకు ప్రయత్నించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఎవరు గొడ్డలి ఎత్తినా ఆ చేయి లేకుండా పోతుందని హెచ్చరించారు. తాము అందించే 'సూపర్ సిక్స' పథకాలతో అభివృద్ధి, సంక్షేమం సమతులంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

**న్యూఢిల్లీ,జులై25 (సింగిడి):**

హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతేగానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

## స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి

ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సూచన ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే వారు ఎవరైనా సరే, ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు 'ఆపరేషన్ అరణ్య'ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని ఆయన తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలో శనివారం రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఆయన అటవీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు వారికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. శనివారం తెల్లవారుజామున వరికుంట్ల గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారంతో వాహనాలను తనిఖీ చేశారు. ఇంటి సామాగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ ట్రక్కులో దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు ఈ ముఠాకు సహకరిస్తున్నట్లు తేలడంతో అతడిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా కేంద్రాలుగా పనిచేస్తున్న ప్రధాన సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సూచించారు.

## ఏఐతో ఉన్న భయాలు తొలగించాలి

**న్యూయార్క్,జులై25 (సింగిడి):**

ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం

**హైదరాబాద్, జులై 25 (సింగిడి)**

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. '' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు'' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

**హైదరాబాద్,జులై 25 (సింగిడి)**

యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతో పాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
25-7-2026



## అసంపూర్తి రోడ్డు పనులను..
# వేగంగా పూర్తిచేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

స్వయంగా రహదారిని పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ

**యాదాద్రి భువనగిరి జూలై 24 (నినాదం ):** ఆలేరు నియోజకవర్గం లోని ఆత్మకూరు మండలం నుండి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. శుక్రవారం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే ఆగి రోడ్డు పరిస్థితిని స్వయంగా పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి రోడ్డు పరిస్థితిని పరిశీలించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌తో మంత్రి చరవాణీ లో మాట్లాడి పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై వివరణ కోరారు. కాంట్రాక్టర్ కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా యాదగిరి గుట్ట--తుర్కపల్లి రహదారిలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులో పనులు ప్రారంభించకపోతే సంబంధిత టెండర్‌ను రద్దు చేసి, ఇతర ఏజెన్సీలకు అప్పగించి రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయిస్తామని



మంత్రి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలిగేలా పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. దీనికి స్పందించిన కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని, ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆర్ అండ్ బి అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

- విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ఏకరూప దుస్తులు అందించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 24 (సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి ఆగస్టు నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, ఖరీఫ్ పంటల సాగు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలను నిర్వహించి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపునకు అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, అవసరమైన యూనిఫాంల వివరాలను అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. క్రాప్ డైవర్సిఫికేషన్‌కు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు పాల్గొన్నారు.

# కామన్ డైట్ మెనూ తప్పనిసరి పాటించాలి

జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట బ్యూరో, జూలై 24 (సింగిడి):** జిల్లాలోని అన్ని గురుకులాలో విద్యార్థులతో మెస్ కమిటీలు వేసి, వంట సరుకులను వారి సమక్షంలో అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రిన్సిపల్ లను ఆదేశించారు. కోహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ శుక్రవారం రోజున ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, క్యాబేజీ, పప్పు, రసం, పెరుగులను తనిఖీ చేశారు. కూరలు నాణ్యతతో పాటు రుచికరంగా ఉన్నాయా అని విద్యార్థులతో ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వండిన ప్రతి వంటకం రుచికరంగా విద్యార్థులందరికీ సరిపోయేలా వండాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. రికార్డు రాయకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సిబ్బందికి సరుకులు అందించే ముందు గురుకులంలో విద్యార్థులతో వేసిన మేస్-కమిటీ సమక్షంలోనే అందించాలని ఇష్టానుసారంగా జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సంబంధించి సరుకులు కొలత ప్రకారం అందించినప్పుడే రికార్డులో రాయాలని ఇలా రాయకపోవడం పైన విచారణ జరపాలని డిసిఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# ఆశా వర్కర్లకు రూ.18000/- వేతనం ఇవ్వాలి

- తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి



**అల్వాల్, జూలై 24(సింగిడి):** ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ,కార్మిక వర్గ ప్రయోజనాల కోసం, మహిళల హక్కుల సాధన కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన అమరజీవి, ప్రముఖ కమ్యూనిస్టు నేత లిలికామ్రేడ్ విమల్ రణదివే 26వ వర్ధంతి జరిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆమెకు హృదయపూర్వక విప్లవ నివాళులు అర్పిస్తోంది. మహిళా కార్మికులను సంఘటితం చేసి, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి బలమైన పునాదులు వేసిన కామ్రేడ్ విమల రానా దేవి నిరంతర పోరాట జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సీఐటీయూ కొనియాడింది. 1915 ఏప్రిల్ 10న జన్మించిన ఆమె, కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్రిటిష్ వలస పాలకులను ధైర్యంగా ఎదుర్కొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. క్షమాపణ చెప్పడానికి నిరాకరించి తన అచంచల దేశభక్తిని, ధైర్యాన్ని చాటుకున్నారు. పేదలు, కార్మికుల పట్ల ఉన్న ఆత్మీయతతో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్వీకరించిన ఆమె.. జైలు జీవితం, అజ్ఞాతవాసం వంటి కష్టాలను లెక్కచేయలేదు. 1946లో జరిగిన ముంబై కార్మిక వర్గం, నౌకాదళ సైనికుల చారిత్రాత్మక తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనంతరం యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కోమలి మాట్లాడుతూనేటి ఉద్యోగ మహిళల సమస్యలు కామ్రేడ్ విమల్ రణదివే ఆశయ సాధనలో భాగంగా, నేటి సమాజంలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై సీఐటీయూ పురుష లతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ అనేక రంగాల్లో మహిళలకు నేటికీ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. 'సమాన పనికి సమాన వేతనం' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు కార్మిక హోదా:లిలి అంగన్‌వాడీ, ఆశా. మధ్యాహ్న భోజన పథకం వంటి రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది మహిళలను ప్రభుత్వాలు 'కార్మికులుగా' గుర్తించి, రూ. 26,000 కనీస వేతనం, ఈఎస్ఐ పిఎఫ్ వంటి సామాజిక భద్రత కల్పించాలి డిమాండ్ చేశారు. సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి కే ఉన్నికృష్ణ మాట్లాడుతూ పని ప్రాంతాల్లో రక్షణ చట్టఅమలు ఐటీ, ఫ్యాక్టరీలు, సేవా రంగం, గిగ్ ఎకానమీ మరియు అసంఘటిత రంగాల్లో మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలి. లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రతి పని ప్రదేశంలో 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' లను ఏర్పాటు చేసి కఠినంగా అమలు చేయాలి లేనిపక్షం లో పోరట్టని ఉధృతం చేస్తాం హెచ్చరించారు. మహిళా కార్మికులను శాశ్వ స్వరూపం ఉన్న పనుల్లో సైతం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో తక్కువ వేతనాలతో శ్రమదోపిడీ చేయడాన్ని అరికట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలని,మాతాశిశు సంక్షేమం ఒ మౌలిక సదుపాయాలు:లిలి అన్ని రంగాల మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, పని ప్రదేశాల్లో ఉచిత శిశు సంరక్షణ కేంద్రాలు, రాత్రి షిఫ్టులలో పనిచేసే మహిళలకు సురక్షిత రవాణా వసతి కల్పించాలనీ కోరారు. కామ్రేడ్ విమల్ రణదివే అందించిన పోరాట స్ఫూర్తితో.. కార్మిక వర్గంపై, ముఖ్యంగా మహిళా కార్మికులపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీలు, లింగ వివక్షను అంతం చేయడానికి సీఐటీయూ పునరంకితమవుతోంది. ప్రతి కార్మికునికి హక్కులు, గౌరవం, సమానత్వం సాధించే వరకు, న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం కోసం ఆమె ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతిజ్ఞ చేస్తోంది. ఈ కార్యక్రమంలో అల్వాల్ మచ్చ బొల్లారం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సకల సంపదలకు చదువువే ఆధారం

- వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్, జూలై 24(సింగిడి):** సకల సంపదలకు చదువువే మూలధారమని వికారాబాద్ మిన్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరి పల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఎక్కడైనా జీవించగలడని అన్నారు. చదువుకునే ప్రాయంలో చదువు విలువ తెలియదని అన్నారు. విలువ తెలుసుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. చదువే అసలైన ఆస్తిగా భావించాలని ఏ ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. విద్యతోనే వికాసమని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాకేష్, మాజీ కౌన్సిలర్ మురళి, టిపిసిసి రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్. అనంతయ్య, పట్టణ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. శ్రీకాంత్, బాలరాజు, గంగారం శ్రీకాంత్, సోషల్ మీడియా నందు, సాయి, హరి, తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్బంధంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి



**నాచారం, జూలై 24 (సింగిడి):** బీఆర్ఎస్వీ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు. ఢిల్లీలో నీట్ బాధిత విద్యార్థులకు మద్దతుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర పోలీసు బలగాలు అమానుషంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి బయలుదేరిన మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని పోలీసులు వారి నివాసంలోనే గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని ఆయన అన్నారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరుకావడాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం దురదృష్టకరం అని ప్రజల గొంతుకను అణిచివేసే ప్రయత్నాలు ఎంత చేసినా విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్వీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉంది , అలాంటి హక్కును హరించే విధంగా వ్యవహరించడం పోలీసు యంత్రాంగానికి తగదు అని దేవేందర్ రెడ్డి అన్నారు.

# ఢిల్లీ నిరసనకారులపై పోలీసుల అత్యుత్సాహం సరికాదు



- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

**కొడంగల్, జూలై 24(సింగిడి):** నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ పైన విద్యార్థులు ఢిల్లీ నడి బొడ్డున జంతర్,మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థుల పైన ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ యువతీ, యువకుల పైన లాఠీఛార్జీలు చేస్తూ, టియర్ గ్యాస్‌ను ఉపయోగిస్తూ అనేకమంది విద్యార్థిని విద్యార్థులను గాయపరిచి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, ఈ లాఠీ తూటాలకు యువతి మృతి పట్ల కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్యలు మాట్లాడుతూ పేపర్ లీకేజీ పైన ప్రశ్నిస్తే పోలీసులు ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడడం సరికాదని ఢిల్లీ పోలీసులు మరిచిపోయి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా ప్రవర్తిస్తూ ఎంతో మంది విద్యార్థులను లాటిలు,తూటాలతో పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ నుంచి ప్రజల మైండ్ డైవర్ట్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకమే ఈ లాటి చార్జ్ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకొని, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారం సాయిలు, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు



**ఆమనగల్లు, జూలై 24(సింగిడి):** ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డు, సర్వే నెం. 662/ఆ/2 లో చట్టవిరుద్ధంగా అనుమతులు లేకుండా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కాలనీ వాసులు కలెక్టర్ కు పిర్యాదు చేశారు, సర్వే నెం. 662/ఆ/2లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పేలుళ్ల వల్ల భారీ శబ్ద, దుమ్ము కాలుష్యం ఏర్పడటమే కాకుండా, ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పర్యావరణ నిబంధనలను, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి సాగిస్తున్న ఈ మైనింగ్ కార్యకలాపాలపై అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ ఫిర్యాదుపై అత్యవసరంగా స్పందించి తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరినట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుక శివ, పులికంటి మహేష్, గోరేటి జగన్, వంకశ్వరం బీమయ్య పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట బ్యూరో, జూలై 24(సింగిడి):** జిల్లా పరిధిలోని కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. రాష్ట్రంలోనే నిర్మాణ పురోగతిలో ఖమ్మం జిల్లా తో సమానంగా అగ్రస్థానంలో కొనసాగుతుందని, 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ అని చెప్పారు . మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో యుద్ధ ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్ల మధ్య నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మెడల్ గా నిలుస్తుందని తెలిపారు.

# ఇందిరా పార్క్‌వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు




**కుత్బుల్లాపూర్, జూలై 24 (సింగిడి):** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టి. రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నా-నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు తో కలిసి పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై దౌర్జన్యానికి పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూసే చర్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు వివరించారు.

# డంపింగ్ యార్డ్ పై 26న అవగాహన సదస్సు

- మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు ఆహ్వానం



**జవహర్ నగర్, జూలై 24 (సింగిడి):** పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత కోసం జరుగుతున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని డంపింగ్ యార్డ్ పై ఈనెల 26న స్వర్ణాంధ్ర డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే అవగాహన సదస్సుకు పెద్ద ఎత్తున హాజరుకావాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి శివ బాబు పిలుపునిచ్చారు. చెత్త డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత జీవించే హక్కు పై డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న అవగాహన సదస్సుకు మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ను శుక్రవారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, రమేష్ చారి, సామాజిక నాయకులు బూడిద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతవన
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
26-7-2026

# ఎడిటోరియల్

Editorial

## కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్నట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు–నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది.

పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజెపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజెపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదారి పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# ఇండియాలో సీనియర్ సిటిజన్స్.... వారి సమస్యలు

**దేశంలో వృద్ధులు వారి సమస్యలు:** పేదరికం కారణంగా భారతదేశంలో వయోవృద్ధులు తమ నిత్య అవసరాలను తృప్తి పరచుకోలేకపోతున్నారు. ఈ రకమైన ఆర్థిక వనరులు లేని వయవృద్ధులకు ప్రభుత్వం నెలకు వృద్ధాప్య పింఛను ఇవ్వడంతో కొంత సహకారంగా ఉంటుంది . కానీఈ సహాయం వారి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. బ్యాంకులలో ఆఫీసులలో వారికి ప్రత్యేక సౌకర్యాలు లేవు. రైల్వే శాఖ వారు మాత్రం వృద్ధులకు రైల్వే టికెట్ విషయంలో కొంత రాయితీ ఇస్తున్నారు. భారత ప్రభుత్వం వృద్ధుల కు సంబంధించిన సమగ్ర వ్యవస్థకు విధానం చేయలేదు. కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు వారి ఆర్థిక పరిమితులకు లోబడి కొన్ని ప్రాంతాలలో వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నారు. 75 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఈ ఆశ్రమంలో స్థానాన్ని నిరాకరిస్తున్నారు. ఇదే భారతదేశంలో వృద్ధాశ్రమాలలో జరుగుతున్న పెద్ద లోటు.

*వృద్ధాప్యం **60** సంవత్సరాల వయసులో ప్రారంభమవుతుంది. ఈ సమయాన దాదాపు ఆ వయసు వారందరూ ఉద్యోగ విరమణ పొందుతారు. అదే సమయంలో వారు శారీరక మానసిక ఆరోగ్యాన్ని గురించి ఆందోళన చెందడం ప్రారంభమవుతుంది . వృద్ధాప్యం ఒక మానసిక దృగ్విషయంగా విషయంగా గుర్తించాలి. వృద్ధాప్యంలో కూడా అనేకమంది రచయితలు, రాజ నీతజ్ఞులు విద్యావేత్తలు యోగులు అనేకమంది వృద్ధాప్యంలో కూడా తమ క్రియాశీలక జీవితాన్ని గడుపుతున్నారు. కాబట్టి వృద్ధాప్యం ఆనందదాయకమైన సంతృప్తికరమైన కాలంగా చెప్పవచ్చు. మానసిక శారీరక సామర్థ్యాల క్షీణత వృద్ధాప్యంలో కచ్చితంగా వేగంగా జరుగుతుందని చెప్పలేం కానీ వారు చెరుకైన గౌరవప్రదమైన జీవితాన్ని **80** నుండి **90** సంవత్సరాల వయసు వరకు గడపవచ్చు.*

ముఖ్యంగా ఆ వయసులోనే వృద్ధులకు ఇతరుల సహాయ సహకారాలు చాలా అవసరం. స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న వృద్ధాశ్రమంలో వృద్ధుల పట్ల ఉదాశీవత కనపడుతుంది. కుటుంబాల విచ్ఛిత్తి: భారతదేశంలో సమిష్టి కుటుంబాల విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాల శాతం భారతదేశంలో నానాటికి పెరుగుతుంది. ఈ విధంగా జరగడానికి ముఖ్య కారణం 1990లో ప్రవేశపెట్టిన సరళీకరణ ఆర్థిక విధానం నగరికరణ పారిశ్రామికీకరణ వేగాన్ని భారత దేశంలో పెంపొందించడం. కుటుంబాల ఆర్థిక స్థితి: ఆర్థిక కారణాల దృష్ట్యా వ్యష్టి కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు నగరాలలో జీవించడానికి ఇద్దరు ఉద్యోగాలు నిర్వహించవలసి వస్తుంది. అందువల్ల వాళ్ళు వృద్ధులైన తల్లిదండ్రులను లేదా అత్త మామల గురించి శ్రద్ధ వహించడానికి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వృద్ధులు సాంఘిక ఆలంబనం: సాంఘిక సంబంధాలను విస్తృత పరచుకోవడం ద్వారా వృద్ధాప్యం సమస్యలను విజయవంతంగా పరిష్కరించుకోవచ్చు. వృద్ధులు తన మనవలు మనవరాన్ల పెంపకంలో బాధ్యతను తమ పిల్లలతో పంచుకోవడం ద్వారా తమ వ్యక్తిగత ఉద్వేగాత్మక అవసరాలను తీర్చుకోవచ్చు. వృద్ధులు మనమరాలకు నమూనా పాత్రను పోషించవచ్చు. ఇలాంటి నిర్వహణ వారికి ఆత్మ సంతృప్తి కలిగిస్తుంది. వారి మనవలు మనవరాళ్ళు ఉన్నత స్థితిలో విద్యాభ్యాసం





చేయడం లేదా ఉద్యోగాన్ని సంపాదించి నప్పుడు వారు కలిగే ఆనందాన్ని ఎవరు వర్ణించలేనిది. ప్రభుత్వ బాధ్యత: వృద్ధులు భారతదేశానికి విలువైన సంపద. ప్రస్తుతం వారు కలిగి ఉన్న విలువలు ఆశలు ఆకాంక్షలు కుటుంబంలో వృద్ధులకు స్థానం లేకుండా చేస్తున్నాయి. ఇంతవరకు మన సమాజంలో వృద్ధాప్య వాస్తవాన్ని గుర్తించ డం లేదు. అంతేకాకుండా వృద్ధాప్య సమస్య లకు పరిష్కార మార్గాలు గుర్తించలేదు. 2026వ సంవత్సరం నాటికి భారత దేశం లో వృద్ధుల శాతం జనాభాలో 12.6% గా ఉంది. వీరి సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం మరియు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణతో సహా ప్రత్యేక విధివిధానాలను రూపొందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.



**పందిరి: శ్రీనివాసులు.**
**ఎంఏ ( జాగ్రఫీ) బిఈడి,**
**ఎంసీజే (జర్నలిజం)**
**పిజిడిసిజే ( జర్నలిజం)**
**ఉస్మానియా యూనివర్సిటీ.**

# కమనీయ చిత్రాల సృష్టికర్త కొండపల్లి

## చిత్రలేఖనంలో సాటిలేని మేటి కొండపల్లి

## కొండపల్లి శేషగిరి రావు వర్ధంతి

చిత్రకళా ప్రపంచంలో ఆయన ఓ మహా వృక్షం. చిత్రకళకు ఎనలేని కీర్తిని ఆర్జించిన పెట్టిన అద్భుత కళాకారులు ఆయన. ఆయనే భారతీయ సాంప్రదాయ చిత్ర లేఖనంలో అద్భుతాలు సాధించిన చిత్ర లేఖకులు కొండపల్లి శేషగిరి రావు. తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరించి, విశ్వ వ్యాపితం చేసిన గొప్ప కళాకారులు శేషగిరిరావు. కొండపల్లి శేషగిరి రావు (జనవరి 22, 1924 – జూలై 26, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ చిత్రకారులైన కొడపల్లి శేషగిరి రావు 1924 జనవరి 22 న వరంగల్ జిల్లా, పెనుగొండ గ్రామంలో ఒక బ్రాహ్మణ భూస్వామ్య కుటుంబంలో జన్మించారు.

వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి, పరిసరాల శిల్ప కళా సౌందర్యాన్ని, ఆయా దృశ్యాల నుండి స్ఫూర్తిపొంది తన మనో ఫలకంపై ముద్రించుకుని, సుదీర్ఘ, సునిశిత అధ్యయనంతో కొన్ని వందల చిత్రాలకు ఆయన జీవం పోశారు.

చిన్నతనం లోనే ఆయనలోని సృజనాత్మకతను పరిశీలించిన ఆ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దీనదయాళ్ ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడవుతాడని గ్రహించారు. ప్రోత్సహించారు.





బెంగాల్, శాంతినికేతన్ లో చిత్రలేఖనం అభ్యసించి, జె ఎన్ టి యు ఫైన్ అర్ట్స్ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టారు. అయితే ఆయన చిత్రలేఖనా ప్రస్థానం అప్రతి హతంగా సాగింది. భారతీయ ఇతిహాస అంశాలను చిత్రించడంలో శేషగిరిరావు పట్టు సాధించారు. ఆయనది అందె వేసిన చేయిగా మలుచుకున్నారు.

అజంతా, ఎల్లోరా గుహల చిత్రాలను (తిరిగి) గీసిన చిత్రకారుడు జలాలుద్దీన్ ద్వారా కొన్ని మెళకువలు నేర్చుకున్నారు. జైపూర్ లోని బనస్థలి విద్యాపీట్ లో "ఫ్రెస్కో" పెయింటింగ్ పద్ధతిని అభ్యసించారు.

ప్రకృతి, చారిత్రక గాథలను.. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆయన సజీవ చిత్రాలుగా మలిచారు. ఆయన చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాల వివిధ సన్నివేశాలు పలువురి ప్రశంసలు అందు కున్నాయి. లేపాక్షి తదితర చారిత్రక చిత్రకళా కేంద్రాలను దర్శించి, తన భావానుగుణంగా రూపు నిచ్చారు. వరూధిని – ప్రవరా ఖ్యుడు, రాణి రుద్రమ, గణపతి దేవుడు, శకుంతల చిత్రాలను చిత్రించారు. పోతన భాగవతాన్ని 16 సార్లకు పైగా చదివి, కొండపల్లి అద్భుత సృష్టి చేశారు. చిత్రించారు. అజంతా, ఎల్లోరా, రామప్ప, రాచకొండ దేనినీ ఆయన వదల లేదు. దశాబ్దాల నాటి రంగుల్లో ఆంధ్రపత్రికలో ముఖచిత్రంగా వచ్చిన పోతన చిత్రాన్ని వందలాది తెలుగువారు ఫ్రేములు కట్టించుకున్నారంటే ఆయన ప్రతిభ స్పష్టం అవుతున్నది. ఆక్వా టెక్స్చర్ పెయింటింగ్‌లకు ఆయన మార్గదర్శకుడిగా చెబుతారు. ఆయన చిత్రాలను దేశ పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ , సాలార్ జంగ్ మ్యూజియం లలో ప్రదర్శించారు. కైరో, ఇటలీ, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, కోలాలాంపూర్, లండన్, అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో శేషగిరిరావు చిత్రాలు ప్రదర్శిత మయ్యాయి. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్‌బర్గ్ వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకు వచ్చాయి.

1975లో ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన రూపొందించిన తెలుగుతల్లి పెయింటింగ్ ప్రశంసలు పొందింది. తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు తెలుగు తల్లిని సాక్షాత్కరింప జేశారు. ఆ చిత్రం ఆధారంగానే తెలుగు తల్లి విగ్రహాలనూ రూపొందించారు. విశ్వామిత్రుడు వంటి ఐతిహాసిక వ్యక్తుల నుంచి, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల నుంచి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వరకూ తన చిత్రంలో నీరాజనం పలికారు కొండపల్లి. అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు, జానపద కళాకారులు ఆయన కళా రూపాల్లో ఒదిగి పోయారు. మహాత్మా.గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పాటు ఎంతో మంది ప్రముఖులు ఆయన చిత్రాలను మెచ్చుకున్నారు. 1994 లో శేషగిరిరావును అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రత్యేకంగా సత్కరించారు. మ్యాక్స్ ముల్లర్ భవన్ డైరెక్టర్ పీటర్ స్విడ్జల అభినందనలు అందుకున్నారు. 1950 నుంచి 90 వరకు ఆయన 37 వ్యాసాలు రాశారు. అవి 'చిత్ర, శిల్పకళా రామణీయకము' పేరుతో 2009లో పుస్తకంగా వెలువడ్డాయి.

హైదరాబాదు, మైసూరు, మద్రాసు, ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కోల్‌కతా అకాడమీ ఆఫ్ ఫైనార్ట్, ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను అందుకున్నారు. భారత దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొన్న అరవై వసంతాల తరువాత ప్రభుత్వం, జులై 2005 లో శేషగిరి రావును "స్వాతంత్ర సమర యోధుడిగా" గుర్తించి 3,000 రూపాయల వేతనం అందించింది.

కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరిటస్ ఫెలోషిప్‌ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ను ఆయనకు అందజేశారు. 1993 లో రాజీవ్ రత్న ఎవార్డు పొందేరు. 1996 లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ప్రతిష్ఠాత్మక హంస అవార్డును కూడా ఆయన అందుకున్నారు.


**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# నేరాల పెరుగుదల.. బాధ్యత ఎవరిది?

## కఠిన చట్టాలు ఒక్కటే కాదు.. వేగవంతమైన న్యాయం, సమర్థ పోలీసింగ్, సామాజిక బాధ్యతతోనే పరిష్కారం

"నేరస్థుడిలో శిక్ష భయం, సమాజంలో చట్టంపై గౌరవం పెరిగినప్పుడే నేరాలు తగ్గుతాయి."

ప్రపంచవ్యాప్తంగా నేరాల స్వరూపం వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఆవేశంలో జరిగే నేరాలు ఎక్కువగా ఉండగా, ఇప్పుడు ప్రణాళికాబద్ధమైన నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్ మాఫియా, మహిళలు--పిల్లలపై



దాడులు, ఆర్థిక నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారతదేశంలోనూ జనాభా పెరుగుదల, సాంకేతికత దుర్వినియోగం, నిరుద్యోగం, సామాజిక విలువల క్షీణత వంటి అనేక కారణాలతో నేరాల సంఖ్య పెరుగుతోంది. నేరాలకు దారితీస్తున్న ప్రధాన కారణాలు. కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, నైతిక విలువలు తగ్గిపోవడం. నిరుద్యోగం, మాదకద్రవ్యాల వ్యసనం. త్వరగా డబ్బు సంపాదించాలనే ధోరణి. సోషల్ మీడియా ద్వారా హింసాత్మక ప్రభావం.

న్యాయ ప్రక్రియ ఆలస్యం కావడంతో శిక్ష భయం తగ్గడం.

సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ పెరుగుతున్న సైబర్ నేరాలు.

ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలు

పోలీస్ శాఖలో ఖాళీలను త్వరగా భర్తీ చేయడం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సంఖ్య పెంచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం. పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలు, రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంచాలి. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు, స్మార్ట్ సర్వైలెన్స్ వ్యవస్థలను విస్తరించాలి.

"నేరం జరిగిన తర్వాత దర్యాప్తు కంటే, నేరం జరగకుండా నిరోధించే వ్యవస్థ మరింత బలంగా ఉండాలి."

పోలీస్ శాఖలో మారాల్సిన విధానం

కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలి. సైబర్ క్రైమ్ దర్యాప్తుకు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందిని పెంచాలి. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించడం ద్వారా పోలీసులపై విశ్వాసం పెరుగుతుంది.

పోలీస్ సిబ్బంది కొరత ప్రభావం

జనాభాకు అనుగుణంగా పోలీస్ బలగం లేకపోవడం వల్ల దర్యాప్తు, శాంతిభద్రతలు, గస్తీ నిర్వహణపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. అయితే సిబ్బంది పెంపుతో పాటు సాంకేతికత వినియోగం, శిక్షణ, సమర్థవంతమైన నాయకత్వం కూడా అవసరం. సమాజం పాత్రను విస్మరించకూడదు

నేరాలను కేవలం ప్రభుత్వం లేదా పోలీస్ శాఖ మాత్రమే అరికట్టలేవు. కుటుంబం, పాఠశాలలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు కలిసి చట్టాలను గౌరవించే సంస్కృతిని పెంపొందించాలి. అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయడం ప్రతి పౌరుడి బాధ్యత. నేరాల నియంత్రణకు ఐదు కీలక సూత్రాలు. వేగవంతమైన న్యాయం, సమర్థవంతమైన పోలీసింగ్, డ్రగ్స్ నియంత్రణ, యువతకు ఉపాధి అవకాశాలు, కుటుంబ, సామాజిక విలువల బలోపేతంకావడం.

నేరాలను తగ్గించే శక్తి కేవలం కఠిన శిక్షల్లో లేదు. శిక్ష భయం, వేగవంతమైన న్యాయవ్యవస్థ, ఆధునిక పోలీసింగ్, ఉపాధి అవకాశాలు, కుటుంబ విలువలు, ప్రజల భాగస్వామ్యం కలిసి పనిచేసినప్పుడే సమాజం మరింత సురక్షితంగా మారుతుంది. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా నిరోధించే వ్యవస్థను బలోపేతం చేయడమే నిజమైన సుపరిపాలనకు కొలమానం.

**ఉక్కల్‌కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**



ప్రభాతవన సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi శనివారం 25-7-2026

## ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి



- సీఎస్ సంజయ్ జాజు

**పెద్దపల్లి, జూలై 24(సింగిడి):** రాష్ట్రంలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన యూనిఫాంల కుట్టు పనుల పురోగతితో పాటు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సమీక్ష నిర్వహించారు. జూలై 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని, నీటి కొరత దృష్ట్యా వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. యూనిఫాంల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని, మహిళా స్వయం సహాయక సంఘాల టైలర్ల ద్వారా కుట్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## తాత ఆశయాలను కొనసాగిస్తా



- వొడితల ప్రణవ్..
- ఘనంగా వొడితల
- రాజేశ్వర్ రావు వర్ధంతి

**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రాజ్యసభ సభ్యుడిగా,రాజకీయాల్లో ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన మహానుభావుడు వొడితల రాజేశ్వర్ రావు అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన వర్ధంతి సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ప్రణవ్. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు,ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి ప్రణవ్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని, ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని, ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు. వారు చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,దేవాలయాల చైర్మన్లు,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,వార్డ్ సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్,బీసీ ఎస్సీ,యువజన,సేవాదళ్,అనుబంధ సంఘాలు,సోషల్ మీడియా,యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలే మంథని అభివృద్ధికి సాక్ష్యం





- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్

**మంథని , జూలై 24 (సింగిడి):** మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలే సాక్ష్యమని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రహదారుల నిర్మాణంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూ. 20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేఎన్టీయూ కళాశాల, రత్నాపూర్ ఇండస్ట్రియల్ పార్క్, అడవి సోంపల్లి ఇంటర్నేషనల్ స్కూల్, గోదావరిపై వంతెన వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు మంథని అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని, ఇటువంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు.

## విధి నిర్వహణలో ఆగిన ఫైర్ కానిస్టేబుల్ గుండె



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** పోలీసు విధులు నిర్వహిస్తున్న సమయంలో అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా పని చేస్తున్న ఓ పోలీస్ గుండె ఆగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మోటం అరవింద్(29) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వేళ విధినిర్వహణలో ఉండగా వాకింగ్ చేసేందుకు బయటకు వెళుతున్న తరుణంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి ఉద్యోగులు సి పి ఆర్ చేసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత సంవత్సరం క్రితం వీణవంక మండల కేంద్రానికి చెందిన అరవింద్ కు ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ఓ యువతితో గత తొమ్మిది మాసాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురుని కంటతడి పెట్టించాయి.

# ఎల్ఎండీ నీటి నిల్వలపై నిత్య పర్యవేక్షణకు ఆదేశం

- తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- పైపులైన్ లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్లపై కట్టడి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జులై24(సింగిడి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, ప్రజారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, నీటి నిల్వలు, వినియోగం, పొదుపు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. పైపులైన్ లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనిచేయని బోర్లను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కొత్తపల్లి--ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంటతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ డెడ్ స్టోరేజ్ పరిస్థితి రాకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి--జంగంపల్లి ప్రాంతాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృత అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్లు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీల ప్రారంభం

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు అతిథుల పిలుపు

చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ



**కరీంనగర్, జులై24(సింగిడి):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ వకాడే, సహాయ కలెక్టర్ పి. హరిప్రసాద్, సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల కేరింతల మధ్య క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించి, ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయని, సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్‌లో క్రీడలకు పెద్దపీట వేస్తూ, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే క్లస్టర్ క్రీడల్లో విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు భరత్ కుమార్, కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, కార్పొరేటర్ వాసాల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు వేముల చంద్రశేఖర్, డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

నిర్బంధాలతో గొంతు నొక్కలేరు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని ప్రభుత్వాలకు హెచ్చరిక

ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు



**కరీంనగర్, జులై24(సింగిడి):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శుక్రవారం కరీంనగర్‌లో దేశవ్యాప్త విద్యార్థుల నిరసనలకు సంఘీభావంగా నిర్వహించిన విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల కలలు ప్రశ్నాపత్రాల లీకేజీలతో దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల వల్ల పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పరీక్షలో జరిగిన లోపం మాత్రమే కాకుండా దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతకు మచ్చగా మిగిలిందన్నారు. నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా విధానం కోసం ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఖండించారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఫీజు తిరిగి చెల్లింపు, వసతి భత్యాలు, ఉపకార వేతనాలు సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు నిరుద్యోగ యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర అసంతృప్తి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, పరిస్థితిని దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించే సంఘవ్యతిరేక శక్తుల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కన్నం లక్ష్మణ్, కూరతోట సురేందర్, కల్వకుంట్ల వంశీధర్‌రావు, బండ సుధాకర్‌రెడ్డి, జనగామ కరుణాకర్‌రావు, పిన్నింటి లక్ష్మణ్‌కుమార్, జంపాల బాబు, పోల్సాని సునీల్, కనపర్తి సాయి, మిరుదొడ్డి అనిల్, భరత్, మంద మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ తలరాత మార్చే శక్తి యువతకే ఉంది

యువతపై బిజెపి సర్కార్ దాడి హేయమైన చర్య

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన



**జమ్మికుంట జులై 24 (సింగిడి):** ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర బీజేపీ సర్కార్ కొనసాగిస్తున్న అణచివేత కు నిరసనగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువతతో పెట్టుకుంటే దేశాలే సర్వనాశనం అయ్యాయని అన్యాయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నది కేంద్ర ప్రభుత్వమని మండిపడ్డారు. యువత విద్యార్థుల స్వరం మారుతోంది నవతరం మేల్కొంటుందని ఈ తరం యువకులు సీబీఐ, ఈడీ, ఐటీ బెదిరింపులకు భయపడదని విద్యార్థులు కోరేది అధికారం కాదు న్యాయం, భవిష్యత్తు మాత్రమే 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను మోసం చేశారని అన్నారు. మేక్ ఇన్ ఇండియా అని చెబుతూ లీక్ ఇన్ ఇండియా గా మార్చారని ఇది రాజకీయ కార్యక్రమం కాదని విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కేసులు వెంటనే ఎత్తివేయాలని భవిష్యత్ నిర్మాతలైన యువత కు కేంద్రం జవాబు చెప్పాల్సిందే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురేష్ మంద రాజేష్ పొన్నగంటి రాము మైనార్టీ నేత జానీ టిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- అన్ని మండపాలకు ఉచిత విద్యుత్, రహదారులు పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి
- మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్, జులై24(సింగిడి):** కరీంనగర్ నగరంలో రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లకు అధికారులు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేయర్ ఉత్సవాల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వినాయక మండపాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చడం, అవసరమైన చోట్ల రహదారి మరమ్మతులు చేపట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. మండపాల విద్యుత్ బిల్లులను నగరపాలక సంస్థ నిధుల ద్వారా చెల్లించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని టవర్ సర్కిల్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయ అలంకరణలతో సుందరీకరించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్, మున్సిపల్, పారిశుధ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి బాధ్యతలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం మరియు అన్ని శాఖల సమన్వయంతో ఈసారి వినాయక నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన సౌకర్యాల కల్పనకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఉత్సవాలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా నగరపాలక సంస్థ అన్ని విధాలుగా చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

## చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరి



**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** చిన్న దూరం ప్రయాణమైనా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజలకు సూచనలు చేశారు., ట్రాఫిక్ నిబంధనలు ప్రతి రహదారిలో అమలులో ఉంటాయని సీఐ లు స్పష్టం చేశారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమే

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని సుమారు 30 సంవత్సరాలుగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సుధాకర్ సార్ కు దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి విరమణ పొందుతున్న సుధాకర్ సార్ సేవలను చైర్మన్ అభినందించారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ తన సేవలను వీలైనప్పుడల్లా విద్యార్థులకు అందించాలని తమ అనుభవాలను రాబోయే తరం టీచర్లకు తెలుపుతూ వారి శేష జీవితం ఆనందమయంగా గడపాలని కోరారు. అనంతరం సుధాకర్ ను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ప్రభుత్వ క బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సుందిళ్లలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు




**మంథని, జూలై 24(సింగిడి):** సుందిళ్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### గులాబీ గూటికి చేరిన అరుణ్



**మంథని, జూలై 24(సింగిడి):** సుందిళ్ల గ్రామానికి చెందిన యువజన నాయకుడు వేముల అరుణ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం విద్యానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుందిళ్ల గ్రామ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు బోగిరి భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేముల అరుణ్‌ను అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి యువత కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రావి కంటి సుజల్(18) అనే విద్యార్థి తన స్నేహితుడు అబ్బడి అశ్విత్ తో కలిసి జగ్గయ్య పల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో సుజల్ కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాధితున్ని హన్మకొండ ఆసుపత్రికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రావి కంటి వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# తొలి ఏకాదశి..ఆధ్యాత్మికతకు శ్రీకారం

సీజనల్ పండుగలకు తొలిమెట్టు
శ్రీ మహావిష్ణువును ఆరాధించే పర్వదినం..
ఉపవాసాలు జాగరణలు
ఆషాఢ మాసంలో ప్రత్యేక విశిష్టత
నేడు తొలి ఏకాదశి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** ఆషాఢ శుద్ధ ఏకాదశి.. తొలి ఏకాదశిగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పర్వదినం. హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిథికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఈ రోజు నుంచే పండుగల పరంపరకు శ్రీకారం చుడుతుందని పెద్దలు చెబుతారు.





**విష్ణు ఆరాధనకు విశిష్టమైన రోజు..**
తొలి ఏకాదశి రోజున భక్తులు తెల్లవారు జామునే నిద్రలేచి తలస్నానం చేసి ఇళ్లను శుభ్రం చేసుకుని శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. విష్ణు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. రోజంతా ఉపవాసం ఉండి పండ్లు, పాలు వంటి సాత్విక ఆహారం తీసుకోవడం, విష్ణు నామస్మరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

**చాతుర్మాస్యానికి ఆరంభం**
తొలి ఏకాదశి నుంచే చాతుర్మాస్యం ప్రారంభమవుతుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళ్తారని భక్తుల విశ్వాసం. నాలుగు నెలల అనంతరం వచ్చే ప్రబోధిని ఏకాదశి రోజున స్వామివారు మేల్కొంటారని చెబుతారు. అందుకే చాతుర్మాస్య కాలాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తూ పూజలు, వ్రతాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఉపవాసం.. ఆత్మ నియంత్రణకు ప్రతీక**
ఏకాదశి ఉపవాసం కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా ఆత్మ నియంత్రణకు ప్రతీకగా భావిస్తారు. ఇంద్రియాలను అదుపులో ఉంచి భగవంతునిపై మనసును కేంద్రీకరించడం ఈ వ్రతం ప్రధాన ఉద్దేశంగా భక్తులు విశ్వసిస్తారు. ఉపవాసం చేయలేని వారు తమ ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా సాత్విక ఆహారం తీసుకుంటూ భగవంతుడిని స్మరించవచ్చు.

**భక్తి.. దానధర్మాలకు ప్రాధాన్యం**
తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తారు. భక్తులు దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు చేపడతారు. పేదలకు, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందని విశ్వసిస్తారు.

**పండుగల సీజన్‌కు శ్రీకారం**
తొలి ఏకాదశి తర్వాత శ్రావణ మాసం, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి అనేక ముఖ్యమైన పండుగలు వరుసగా వస్తాయి. అందుకే తొలి ఏకాదశిని "పండుగల సీజన్‌కు తొలిమెట్టు"గా కూడా అభివర్ణిస్తారు.

**ఆధ్యాత్మికతను పెంపొందించే పర్వదినం**
మొత్తంగా తొలి ఏకాదశి మనిషిలో భక్తి, నియమం, ఆత్మ నియంత్రణ, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే పవిత్రమైన పర్వదినం. ఈ రోజున భక్తిశ్రద్ధలతో శ్రీమహావిష్ణువును పూజించి, సత్యం, ధర్మం, దయ, సేవ వంటి సద్గుణాలను జీవితంలో ఆచరించాలని పెద్దలు సూచిస్తారు. తొలి ఏకాదశి పర్వదినం ప్రతి ఇంటా భక్తి, శాంతి, సుఖసంతోషాలను నింపాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## రామగుండం జీజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలని, వాటిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసరంగా ఖర్చు చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ, ఫిజియోథెరపీ, 2డీ ఎకో, అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో ఫిజీషియన్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ప్రతి విభాగంలో అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ప్రత్యేక వైద్యుల అందుబాటు రోజులు, చికిత్సల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ..
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు



**మహాముత్తారం, జూలై 24(సింగిడి):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహాముత్తారం మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ చేపట్టిన 'గ్రీన్ ఛాలెంజ్' స్ఫూర్తితో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, బోర్లగూడెం సర్పంచ్, మహాముత్తారం మండల బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అజ్మీర ధరమ్ సింగ్, మాజీ సర్పంచ్ వనజ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చీకట్ల లింగయ్య గౌడ్, కనుకునూరు మాజీ సర్పంచ్ లక్ష్మీ రాంబాబు, సింగంపల్లి ఉపసర్పంచ్ రవీందర్, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని లక్ష్మయ్య, బోడ బాలాజీ, సత్తిరెడ్డి, పంగ సంపత్, స్రవంతి, కొయ్యల రమేష్, మహేష్, బెల్లంకొండ పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి

ఎమ్మెల్యే విజయరమణరావు



**పెద్దపల్లి, జూలై 24(సింగిడి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తప్పనిసరిగా నమోదయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. పట్టణ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిఎల్ఓలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సర్‌పై విస్తృతస్థాయి సమావేశం



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రాష్ట్రంలో సమగ్ర ఓటు సవరణ నమోదు ప్రక్రియ(సర్ )సమయం దగ్గర పడుతున్నా కొద్ది కాంగ్రెస్ పార్టీ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ ల పని తీరుపై,సందేహాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు సుడా మాజీ ఛైర్మెన్,హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమలాపూర్,వీణవంక మండల పరిధిలోని గ్రామాల బిఎల్ఏ,కో ఆర్డినేటర్లుతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు బిఎల్ఏ వద్ద ఉన్నపూర్తి సమాచారం కో ఆర్డినేటర్ల వద్ద ఉందా లేదా అని ప్రశ్నించారు?గ్రామాల్లో ఓటు నమోదు ఫారం రాకపోతే బిఎల్ఓ కి కో ఆర్డినేటర్లకు తెలపాలని అక్కడ నుండి మాకు చేరవేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సర్ పై సీరియస్ గా దృష్టి పెట్టింది కావున ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజురాబాద్ కి సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలిపారని తెలిపారు.తెలిసి ఒక్క కూడా వృధా కాకుండా చూడాలని కార్యకర్తలకి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్,వీణవంక మండల నాయకులు,గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అటవీ భూముల ఆక్రమిస్తే చర్యలు తప్పవు!

డోజర్లు, ట్రాక్టర్ల యజమానులతో పోలీసుల సమావేశం
ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు



**మహాముత్తారం, జూలై 24(సింగిడి):** అటవీ భూముల పరిరక్షణకు పోలీసు, అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహాముత్తారం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డోజర్, ట్రాక్టర్ యజమానులతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో కాటారం, ఆజంనగర్, పెగడపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారులతో కలిసి ఈ సమావేశం జరిగిన సమావేశంలో ఎస్సై రమేష్ మాట్లాడుతూ అటవీ భూములను ఆక్రమించేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని అటవీ భూములను అక్రమంగా చదును చేయడం, ఆక్రమణలకు పాల్పడటం లేదా వాటికి సహకరించడం చట్టవిరుద్ధమని తెలిపారు. డోజర్లు, ట్రాక్టర్లను ఉపయోగించి అటవీ భూముల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులతో దురుసుగా ప్రవర్తించడం, విధులకు ఆటంకం కలిగించడం కూడా చట్టరీత్యా నేరమని వివరించారు. అటవీ సంపద, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ రమేష్ కోరారు. ఈ సమావేశంలో రేంజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

8 మంది అరెస్ట్.. రూ.5,430 నగదు,
3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జూలై 24 (సింగిడి):** పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,430 నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని గ్రామ శివారులో జరిగింది. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో చింతకాని గ్రామ శివారులోని పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదుతో పాటు 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్న సమయంలో మరో వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాటారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ.. జిల్లాలో జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాల్లో పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

## చేనేత ఉత్పత్తులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

కులవృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్



**జమ్మికుంట జులై 24 (సింగిడి):** చేనేత ఉత్పత్తులను పెంచడం ద్వారా చేనేత వృత్తుల వారికి చేయూత ఇస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చేనేత కుల వృత్తులను ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సమీకృత వస్త్రోత్పత్తి కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కమిటీ వారిని సన్మానించారు.కేంద్రంలో జరుగుతున్న పనులను,దినసరి వేతనం గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం,సంఘం అధ్యక్షుడు ఉపేందర్,ఉపాధ్యక్షులు తిరుపతయ్య,కోశాధికారి మహదేవ్,కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెత్త బయట వేస్తే అపరాధ రుసుము

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక స్వీట్ హౌస్ మరియు ఒక కిరాణా దుకాణం యాజమాన్యాలు తమ వ్యాపార సంస్థల చెత్తను రోడ్డుపై వేయడం గుర్తించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయా రెండు వ్యాపార సంస్థలకు రూ.1,000 చొప్పున అపరాధ రుసుము విధించారు. వ్యాపారులు తమ దుకాణాల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనానికే అందజేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు కె. కిరణ్, దొడ్డ సంపత్ పాల్గొన్నారు.

## అటవీ సంపద పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

వనపర్తి డిఎఫ్ఓ రేవంత్ చంద్ర



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (సింగిడి):** అటవీ సంపద పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వనపర్తి జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారిగా ఉన్న రేవంత్ చంద్ర వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు జిల్లా అటవీ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నియంత్రణ, అటవీ నేరాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అటవీ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మొక్కల సంరక్షణ, హరితహారం, కంపా పనులు, నర్సరీల నిర్వహణ ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శాఖ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని, పనులను నాణ్యతతో చేపట్టాలని కోరారు. ప్రతి అధికారి, ఉద్యోగి సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేటీఆర్ సేవలు

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్





**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామగుండంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మొక్కల నాటడం, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ, డయాలసిస్ రోగులకు ఆర్థిక సహాయం, రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం, ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కేటీఆర్‌కు తెలంగాణ సమాజం అండగా నిలవాలని కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కౌశిక్ హరి, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, మూల విజయారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, మేకల సమ్మయ్య యాదవ్, కర్క పద్మజ, తోకల రమేష్, మెతుకు దేవరాజ్, నూతి తిరుపతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఈదునూరి పర్వతాలు, కృష్ణవేణి, ఈదునూరి శ్రీకాంత్, కిరణ్ జి, చింటూ, దొమ్మేటి వాసు, కనుకరాజు, సాజీదా, పద్మ, కర్రావుల రామరాజు, కోల సంతోష్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (సింగిడి):** భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఖిల్లా ఘనపూర్ మండలంలోని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామమైన మల్కాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామాన్ని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం ప్రత్యేక అవకాశమని అన్నారు. భూముల రికార్డులను సమగ్రంగా, పారదర్శకంగా నవీకరించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, డిజిటల్ భూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ల్యాండ్ రీ-సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, రైతులు తమ భూముల సరిహద్దుల నిర్ధారణలో రెవెన్యూ, సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామస్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎల్-నినో ప్రభావంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రాబోయే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, స్వల్పకాలిక పంట రకాల ఎంపిక, బిందు సేద్యం (మైక్రో ఇరిగేషన్) వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ఉద్యానవన పంటల సాగులో నేల తేమను కాపాడుకునే చర్యలు చేపట్టడంతో పాటు, దిగుబడి తగ్గకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఎల్-నినో ప్రభావానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు, సాంకేతిక సూచనలను క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం అందిస్తూ అందుబాటులో ఉండాలని మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు (ఏఓలు), ఉద్యానవన అధికారులు, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులుపాల్గొన్నారు.

## ఈ ఆకులు రెండు

వంటింటి ఔషధం..

# నోట్లో వేసుకుంటే?



పుదీనా మన వంటగదిలో సులభంగా దొరికే సుగంధ మూలిక. ఇది ఆహారానికి ప్రత్యేక రుచిని, సువాసనను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, ఒత్తిడి, తక్కువ శారీరక శ్రమ వంటి కారణాలతో గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం కొంత ఉపశమనాన్ని అందించవచ్చు. అయితే ఇది ఏ వ్యాధికీ ప్రత్యక్ష ఔషధం కాదని గుర్తుంచుకోవాలి. పుదీనాలో ఉండే మెంథాల్ వంటి సహజ సమ్మేళనాలు జీర్ణవ్యవస్థ కండరాలను సడలించడంలో సహాయపడతాయి. దీంతో కొంతమందిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం తర్వాత వేడి పుదీనా టీ లేదా పుదీనా నీటిని తీసుకోవడం జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

**ఎసిడిటీ ఉంటే కాస్త జాగ్రత్త**

పుదీనా కొందరిలో కడుపు అసౌకర్యాన్ని తగ్గించవచ్చు. అయితే GERD (గ్యాస్ట్రోఎసోఫేజియల్ రిఫ్లక్స్) లేదా తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ సమస్య ఉన్నవారిలో గుండెల్లో మంటను పెంచే అవకాశం కూడా ఉంది. అందువల్ల అలాంటి వారు వైద్యుల సలహాతోనే పుదీనాను తీసుకోవాలి.

**నోటి దుర్వాసనకు ఉపశమనం**



పుదీనాలోని సహజ యాంటీబ్యాక్టీరియల్ గుణాలు నోటిలో దుర్వాసనకు కారణమయ్యే కొన్ని సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. భోజనం అనంతరం కొన్ని తాజా పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా మౌత్ రిన్స్ ఉపయోగించడం వల్ల నోరు తాజాగా ఉంటుంది.



**రోగనిరోధక శక్తికి మద్దతు**

పుదీనాలో విటమిన్‌ఏ, విటమిన్ ఇ, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం రోగనిరోధక శక్తికి మద్దతునిస్తుంది.





**చర్మ ఆరోగ్యానికి ఉపయోగకరం**

పుదీనాలోని శోథ నిరోధక గుణాలు మొటిమలు, చిన్నపాటి చర్మ వాపులు, అధిక నూనె ఉత్పత్తిని నియంత్రించడంలో కొంతవరకు సహాయపడవచ్చు. కొంతమంది పుదీనా పేస్ట్ లేదా ఫేస్ ప్యాక్‌లను ఉపయోగిస్తారు. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చిన్న ప్రాంతంలో పరీక్షించి ఉపయోగించడం మంచిది.

**బరువు నియంత్రణలో పరోక్ష సహాయం**

పుదీనా నేరుగా బరువు తగ్గించదు. కానీ జీర్ణక్రియను మెరుగుపరచడం, చక్కెర పానీయాలకు బదులుగా పుదీనా నీటిని తీసుకునే అలవాటు ఏర్పడితే మొత్తం కేలరీల వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో బరువు నియంత్రణకు పరోక్షంగా సహాయపడుతుంది.

**పుదీనాను ఎలా తీసుకోవాలి?**

- ఉదయం 5-6 పుదీనా ఆకులను గోరువెచ్చని నీటిలో వేసి తాగవచ్చు.
- పుదీనా-అల్లం హెర్బల్ టీ తయారు చేసుకుని తాగవచ్చు.
- చట్నీలు, సలాడ్లు, శాండ్‌విచ్‌లు, సూప్‌లలో కలిపి తీసుకోవచ్చు.
- నిమ్మరసంతో కలిపి పుదీనా నీరు తయారు చేసుకోవచ్చు.
- మజ్జిగలో పుదీనా, జీలకర్ర పొడి కలిపి తాగితే జీర్ణక్రియకు తోడ్పడుతుంది.
- తీసుకునే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలు
- పుదీనాను అధికంగా తీసుకోవడం అందరికీ అనుకూలం కాదు.
- తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్, కడుపు పూతలు లేదా దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించాలి.
- గర్భిణీలు లేదా కొన్ని మందులు వాడుతున్నవారు క్రమం తప్పకుండా అధిక పరిమాణంలో పుదీనా తీసుకునే ముందు వైద్య సలహా తీసుకోవాలి.
- గ్యాస్, కడుపు నొప్పి, రక్తపు మలం లేదా నిరంతర అజీర్ణం వంటి లక్షణాలు ఉంటే కేవలం ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం



# 29 నుంచి మణిపాల్ హెల్త్ రూ.9275 కోట్ల ఐపీఓ




**దిల్లీ: ప్రముఖ హాస్పిటల్ చైన్ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ. 9,275 కోట్లు సమీకరించే లక్ష్యంతో జులై 29 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ. 560-590గా నిర్ణయించింది. రూ. 77,600 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ చేపట్టనుంది.**

ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 8000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 2.16 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ప్రమోటర్లు అయిన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు టీపీజీ ఎస్‌జీ మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మర్ ఎస్‌డీఎన్ బీహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఆసియా, ఫోనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాలు విక్రయించనున్నాయి.




**ఐపీఓ నిధులు వీటికే**

ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 5,378 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణాలు తిరిగి/ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరో అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటాల కొనుగోలుకు రూ. 574 కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. జులై 28న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకోనుంది. జులై 31న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. క్యూఐబీలకు 75 శాతం, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. ఉద్యోగులకు రూ. 15 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. ఒక్కో షేరుపై రూ. 56 డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇన్వెస్టర్లు కనీసం 25 ఈక్విటీ షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి.

**దేశవ్యాప్తంగా హాస్పిటల్స్**


మణిపాల్ హెల్త్ సంస్థకు దేశవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 38 హాస్పిటల్స్ (ప్రొఫార్మా బేసిస్‌లో 48) కలిగి ఉంది. 10,761 లైసెన్స్‌డ్ బెడ్లు నిర్వహిస్తోంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సేవలందిస్తోంది. 2025 నవంబర్‌లో 49వ హాస్పిటల్‌ను బెంగళూరులో ప్రారంభించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి తొలి ఆరు నెలల్లో రూ. 4,713 కోట్ల ఆదాయాన్ని, రూ. 571.8 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆగస్టు 5న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం గ్రే మార్కెట్‌లో 4 శాతం ప్రీమియం పలుకుతోంది.

విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్..

## స్పష్టతనిచ్చిన సంస్థ




**దిల్లీ:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది.



ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (AEW&C-MKII) వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)ఓ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ విమానయాన రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఊహాగానాలు వచ్చాయి

# వృద్ధి భయాలు.. ఐదో రోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టీ, ఫార్మా స్టాక్స్



అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# హోండా ధమాకా.. ఒకేసారి 10 మోడళ్ల ఆవిష్కరణ

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన టూవీలర్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. దేశీయ మార్కెట్‌లోకి కొత్తగా 10 మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఏడు పూర్తిగా కొత్తవి కాగా.. మూడు మోడళ్లను అప్‌డేట్ చేసింది. స్కూటర్లు, రోడ్‌స్టర్, క్రూయిజర్, అడ్వెంచర్ విభాగానికి చెందిన టూవీలర్లు ఇందులో ఉన్నాయి. ICE, ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఆప్షన్‌తో లభించనున్నాయి. దేశీయ వాహనదారుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా వీటిని తయారుచేయనున్నట్లు కంపెనీ తెలిపింది. వీటిని దశలవారీగా మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ధర, మార్కెట్‌లో అందుబాటు వంటి వివరాలు ఆయా మోడళ్లను లాంచ్ చేసినప్పుడు కంపెనీ వెల్లడించనుంది.

విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్.. స్పష్టతనిచ్చిన సంస్థ

హోండా ADV160: హోండా తీసుకొస్తున్న అడ్వెంచర్ స్కూటర్ ఇది. 160 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానుంది. ఇ85 ఇథనాల్ ఫ్యూయెల్‌కు సపోర్ట్ చేస్తుంది. 8.1 లీటర్ల ఫ్యూయెల్ ట్యాంక్, 27 లీటర్ల అండర్-సీట్ స్టోరేజ్ కలిగి ఉంటుంది.



హోండా CB500: సీబీ 350 రేంజ్‌లో 501 సీసీ వేరియంట్‌లో సింగిల్-సిలిండర్, ఎయిర్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న రెట్రో రోడ్‌స్టర్ బైక్ ఇది. రెట్రో లుక్, మంచి రైడింగ్ అనుభవం కోరుకునే వారి కోసం ఈ బైక్‌ను తీసుకురానుంది.

హోండా రెబెల్ 300: 286 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న ఎంట్రీ-లెవల్ క్రూయిజర్ బైక్ ఇది. స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యమవుతుంది.

రెబల్ 500: 471cc పారలల్-ట్విన్ ఇంజిన్‌తో దేశీయ మార్కెట్‌లోకి మరోసారి రీ ఎంట్రీ ఇస్తున్న మోడల్ ఇది. గతంలో పరిమిత సంఖ్యలో హోండా వీటిని విక్రయించింది. ఇది కూడా స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యం కానుంది.

హోండా XR300L: హోండా నుంచి వస్తున్న ఆన్-రోడ్, ఆఫ్-రోడ్ బైక్. 293.5 సీసీ కెపాసిటీతో రానుంది.

XR300 ర్యాలీ: దూరపు ప్రయాణాల కోసం టూరింగ్, అడ్వెంచరస్ బైక్. గ్లోబల్‌గా విక్రయిస్తున్న ర్యాలీ బ్రాండ్ డిజైన్‌తో ఈ బైక్‌ను తీసుకురానున్నారు.

హోండా QC3 ఈవీ: హోండా తన ఈవీ పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది. 3 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 151 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణిస్తుంది. 2.40 గంటల్లో 0-80 శాతం ఛార్జ్ అవుతుంది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, స్మార్ట్ కీ వంటి ఫీచర్లు ఉన్నాయి.

**ఏమిటీ ఇ- క్లచ్ టెక్నాలజీ:** హోండా కొత్తగా ఇ-క్లచ్ లీవర్ టెక్నాలజీని పరిచయం చేస్తోంది. ట్రాఫిక్‌లో వాహనాన్ని నడపడం సులభతరం చేయడం కోసం క్లచ్ లీవర్‌ను ఉపయోగించకుండానే గేర్లు మార్చే సదుపాయం తీసుకొస్తోంది. ఈ సిస్టమ్ ఆటోమేటిక్‌గా క్లచ్ ఆపరేషన్స్‌ను నిర్వహిస్తుంది. మాన్యువల్‌గా ఆపరేట్ చేసే అవసరం ఉండదన్నమాట.

రాత్రుళ్లు నిద్రపట్టక

## ఇబ్బంది పడుతున్నారా.?

**నేటి ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, మానసిక ఆందోళనల వల్ల రాత్రివేళల్లో సరైన నిద్ర లేక బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మంచంపై పడుకున్నప్పటికీ గంటల తరబడి నిద్రపట్టక కళ్లు మూసుకుని అటుఇటూ దొర్లుతుంటారు. మీరు కూడా ఇలాంటి సమస్యతోనే బాధపడుతున్నారా? అయితే మీకు మిలిటరీ స్లీప్ మెథడ్ ఎంతో సహాయపడుతుంది. కేవలం 120 సెకన్లలో అంటే 2 నిమిషాల్లో ప్రశాంతమైన, గాఢమైన నిద్రలోకి జారుకోవడానికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. అసలు ఏమిటి మిలిటరీ స్లీప్ మెథడ్..?**



**మిలిటరీ స్లీప్ మెథడ్ అంటే ఏమిటి..?**

అమెరికన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ కోచ్ లాయిడ్ బడ్ వింటర్ రాసిన రిలాక్స్ అండ్ విన్: ఛాంపియన్‌షిప్ పెర్ఫార్మెన్స్ పుస్తకంలో ఈ సాంకేతికత గురించి ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రతికూల పరిస్థితుల్లో కూడా అమెరికన్ నేవీ పైలట్లు త్వరగా నిద్రపోయి, చురుగ్గా పనిచేసేందుకు ఈ విధానాన్ని రూపొందించారు. 6 వారాల పాటు క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా 96శాతం మందిలో ఇది విజయవంతమైన ఫలితాలను ఇచ్చింది.

**ఈ పద్ధతిని ఎలా పాటించాలి?**



కళ్లు మూసుకుని, ముఖం, కళ్లు, గడ్డం, దవడలు, నోటి కండరాలలోని ఒత్తిడిని పూర్తిగా వదిలేయండి. భుజాలను సాధ్యమైనంత కిందకు దించి, చేతులను శరీరం ఇరువైపులా ప్రశాంతంగా ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంటూ, ఛాతీ భాగం ప్రశాంతంగా మారేలా గాలిని బయటకు వదలండి. కాళ్లను విశ్రాంతిగా ఉంచండి అంటే.. తొడలు, పిక్కలు, పాదాల వరకు ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి లేకుండా చూడండి.

చివరిగా 10 సెకన్ల పాటు మీ మనస్సులో ఎటువంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని పచ్చని కొండలు, ప్రశాంతమైన సముద్ర తీరం వంటివి ఊహించుకోండి. ముఖం, భుజాలు, చేతులు, కాళ్లలోని కండరాలను క్రమపద్ధతిలో సడలించి ప్రశాంతంగా ఉంచాలి. నెమ్మదిగా, దీర్ఘంగా శ్వాస తీసుకుంటూ శరీరంలోని ఒత్తిడిని పూర్తిగా బయటకు పంపాలి. 10 సెకన్ల పాటు మనస్సులో ఎటువంటి ప్రతికూల ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన ప్రకృతి దృశ్యాలను ఊహించుకోవాలి.

ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ పద్ధతి వెంటనే ఒకే రోజులో ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. కనీసం 6 వారాల పాటు సాధన చేస్తేనే మెదడు, శరీరం దీనికి అలవాటు పడతాయి. అలాగే నిద్రపోయే సమయానికి కనీసం అర్ధగంట ముందు మొబైల్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండటం మంచిది.

మసకగా ఉన్న కంటిచూపు

పూర్తిగా పోవాలంటే....

## ఒక చెంచాడు తింటే..?

**ఇంకా దీనిలో శరీరానికి కావాల్సిన పోషకాలు ఉన్నాయి. అవిసె గింజలు, వాల్ నట్స్‌లాగే ఇవి అంతే. ఇంకా ఇవి ఆయుర్వేదంలో కూడా వీటిని వాడుతారు. అయితే ఈ హలీం గింజల్ని ఎక్కువగా జుట్టు రాలడానికి తగ్గించడంలో వాడతారు. ఇంకా వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యంగా ఉంచేందుకు కూడా ఇది హెల్ప్ అవుతాయి. ఇంకా ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.**



**వీటిని తింటే ఎన్నో లాభాలు :** హలీం గింజలు తింటే శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. ఇంకా బ్లడ్ లో హిమోగ్లోబిన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి. ఇంకా శ్వాస కోశ సమస్యలు కూడా దూరమవుతాయి. ఇంకా అలసట, నీరసం, జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి. కాబట్టి, వీటిని తింటూ ఉండండి.

మసకగా ఉన్న కంటిచూపు పూర్తిగా పోవాలంటే ఒక చెంచాడు తింటే చాలు విజన్ 100% అమాంతం పెరుగుతుంది. వీటిలో ఎక్కువగా విటమిన్లు ఎ, ఇలు ఉంటాయి. ఈ హలీం గింజల్ని తీసుకుంటే చర్మం కూడా కాంతి వంతంగా మెరుస్తుంది. ఇవి శరీరంలోని ఆక్సీకరణ స్ట్రెస్ ను కూడా ఇవి తగ్గిస్తాయి. జుట్టుకు కూడా బలాన్ని ఇస్తుంది.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
26-7-2026

# ఐదేళ్లు నిండిన ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### ప్రీ ప్రైమరీ నుంచే నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందించాలి.. తూడుకుర్తి పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను పరిశీలించిన కలెక్టర్ ఎమ్మెల్సీ

**నాగర్ కర్నూల్ (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్యే బలమైన పునాది అని, ఈ దశలోనే పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి సందర్శించారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతులను పరిశీలించి, తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన విద్యా వాతావరణం, చిన్నారులకు అందుబాటులో ఉంచిన ఆట వస్తువులు, బోధనా సామగ్రి, విద్యార్థుల హాజరు, బోధనా విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల నమోదు, తరగతుల నిర్వహణ, తల్లిదండ్రులతో సమన్వయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.... గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రీ ప్రైమరీ విద్య ద్వారానే చిన్నారుల్లో భాషా నైపుణ్యాలు, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తూ, పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, కార్యకలాపాల ఆధారితబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ......, ప్రైవేటు పాఠశాలలపై ఉన్న ఆకర్షణ కారణంగా అనేక మంది తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేసి మరీ చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని, ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రీ ప్రైమరీ తరగతులను ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభించే నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు స్థాయిలో నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేర్పించాలని ఎమ్మెల్సీ కోరారు. ముఖ్యంగా తూడుకుర్తి గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ



పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి గ్రామస్థుడికి వివరించాలని అన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఏటీసీ (ఊజ) కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్ర నిర్మాణానికి అనువైన స్థలం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థలానికి సంబంధించిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, విద్యాశాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు ఆరుతడి పంటలు
# సాగు చేసేలా ప్రోత్సహించాలి
### ఏకరూప దుస్తులను సకాలంలో కుట్టించి విద్యార్థులకు అందజేయాలి
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల బ్యూరో (సింగిడి):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఏకరూప దుస్తులు, వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఆగస్టు 15లోగా అందించేలా నిబంధనల ప్రకారం కుట్టించాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఆయా జిల్లాల్లో పంటల సాగుపై సమీక్షించారు. ఈనెల 27వ తేదీ నుంచి 29 వరకు మండలాల వారీగా రైతులు సద్వినియోగం చేసుకునేలా విత్తన మేళాలను నిర్వహించాలని ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో యూనిఫామ్స్ కుట్టిస్తున్నందున అవసరమైన సామాగ్రిని వారికి అందజేయాలని, విద్యార్థులకు



ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టిచ్చింగ్ ఉండాలని ఆదేశించారు. ఆయా మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, వారికి కావాల్సిన ఏకరూప దుస్తుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు పెరిగేలా రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా శాఖలలోని వివిధ అంశాలకు సంబంధించి మండల, గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్లను రూపొందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, డిపిఓ శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఏఓ వీరప్ప, సిపిఓ పాపయ్య, డిడబ్ల్యుఓ సునంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు ఇచ్చారు.. మోకా చూపటం మరిచారు
### సిపిఎం తాడూరు మండల కార్యదర్శి అంతటి కాశన్న



**నాగర్ కర్నూల్ (సింగిడి):** తాడూరు మండలం బాలాన్ పల్లి గ్రామంలో పట్టాలు ఇచ్చిన నిరుపేద కుటుంబాలకు మోకా చూపాలని శుక్రవారం బాలాన్ పల్లి గ్రామంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం తాడూరు మండల కార్యదర్శి అంతటి కాశన్న మాట్లాడుతూ. పట్టాలు ఇచ్చారు కానీ మోకా చూపటం మరిచారని వెంటనే సర్టిఫికెట్లు పొందిన నిరుపేదలందరికీ మోకా చూపించాలని డిమాండ్ చేశారు. 1999 లో గత ప్రభుత్వం ఇల్లు లేని 54 మంది నిరుపేదలకు 116 గజాల తో ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టా సర్టిఫికెట్లు జారీ చేసిందని ప్రభుత్వం ఇచ్చిన ఈ సర్టిఫికెట్లలో హద్దులు లేని కారణంతో నేటి వరకు పట్టదారులు ఇంటి నిర్మాణాలకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాడూరు మండల తహసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకొని సర్వే యర్ తో ప్లాట్లకు హద్దులు గుర్తించాలని కోరారు. పేదలకు ఇచ్చిన ప్లాట్ లలో ప్రభుత్వమే ఇతర నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తుందని ప్రభుత్వానికి ఇది సమంజసంకాదని అన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన ప్లాట్ లలో హద్దులు చూపాలని ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం నిరుపేదల పట్ల జాలితో ఉండాలని వారికి వెంటనే మోకా చూపించి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవ డానికి సహకరించా లన్నారు. పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో పేదల ఇండ్ల నిర్మాణం కాకుండా ఇతర నిర్మాణాలు చేపడితే ఇండ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి పి ఐ కార్యదర్శి బసవయ్య సిపిఐ వెంకటస్వామి గోపాల్ ఎండి హుస్సేన్ లక్ష్మయ్య రాములమ్మ సుల్తాన్ ముసలయ్య పాల్గొన్నారు.

## ఫీజుల బకాయి బీజేపీ లడాయి పోస్టర్ విడుదల



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** బి జె వైయం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు బి జె వైయం ఆధ్వర్యంలో పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ పై ఉద్యమ కార్యాచరణను చేపట్టింది. ఈ సందర్భంగా ఫీజుల బకాయి బీజేపీ లడాయి అనే పోస్టర్ ను రిలీస్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే వాటిని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసే వరకు రోజు వారిగా ఉద్యమిస్తామని తెలిపారు. ఉద్యమంలో భాగంగా రేపటినుండి కళాశాలకు వెళ్లి ప్రతి విద్యార్థిని కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తామని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్రీనివాస్, మోహన్, కోశాధికారి మణి, చేతన్, డి. మణి, నవీన్ చామకూర, గోకుల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువతకు
# 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్
### జూలై 25 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

**గద్వాల బ్యూరో (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్ నిర్వహిస్తున్నట్లు టీజీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 25, 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభం కానుందని వివరించారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.00 లక్షల లోపు ఉండాలని తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. ఈ ఫౌండేషన్ కోర్స్‌లో గ్రూప్-I, గ్రూప్-II, గ్రూప్-III, గ్రూప్-IV, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధనతో పాటు వీక్లీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించబడతాయని, లైబ్రరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కోచింగ్ కాలంలో అభ్యర్థులకు ప్రతి నెల రూ. 1,000 చొప్పున బుక్ ఫండ్, రవాణా భత్యంగా స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థులకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశమని, అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 08546-293022, 9985434941 ఫోన్ నంబర్లు కు సంప్రదించాలన్నారు.

# కళాశాలలలో సివిల్ పనులు పూర్తి చేయండి
### ప్రిన్సిపాల్‌ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మంజూరైన నిధులతో త్వరగా సివిల్ పనులను, ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేసి బిల్లులు సబ్మిట్ చేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్ ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ ల సమావేశం ఇంటర్ విద్యా కార్యాలయంలో జరిగింది. జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ కళాశాలలో ఇతర మరమ్మతులు, ఎలక్ట్రికల్ మరమ్మతులు, అవసరమైన సామాగ్రి కొనుగోలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులు కూర్చునే ఫర్నిచర్ ను మరమ్మతులు చేయించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు ప్రిన్సిపాల్ లకు లెక్చరర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు అధ్యాపకులకు కేటాయించిన తేదీలలో హాజరయ్యే విధంగా ప్రిన్సిపల్ లు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆదేశించారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో మరిన్ని అడ్మిషన్లను పెంచేందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ లు, అధ్యాపకులు సమన్వయంతో ప్రతి గ్రామంలో ఇంకా 10వ తరగతి చదివి కళాశాలలలో చేరని విద్యార్థులను గుర్తించి వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ఆదేశించారు. ఇదివరకే అడ్మిషన్లు అయిన విద్యార్థుల యు డైసు, ఆధార్ అప్డేట్లు వెంట వెంటనే చేయించాలని ప్రిన్సిపల్ లను జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. ఈ విద్యా



సంవత్సరానికి గాను విద్యార్థులకు ఇప్పటినుండి ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేయడంతో పాటు విద్యార్థిని విద్యార్థులలో క్రమశిక్షణను పెంపొందించాలని, సామాజిక స్పృహను పెంపొందించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు స్లిప్ టెస్టులతో పాటు నెలవారి పరీక్షలను నిర్వహించి వారి మార్కులను నమోదు చేయాలని, ఫలితాలను విద్యార్థులకు తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు విద్యార్థులను గ్రేడుల వారిగా విభజించి ప్రత్యేక శిక్షణను ఇచ్చే విధంగా ఇప్పటినుండి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. అధ్యాపకుల కొరత ఉన్న కళాశాలల్లో వెంటనే అతిథి అధ్యాపకులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. అలాగే బోధన బోధనేతర సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

### భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో
## బోనాల ఊరేగింపు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ పాల్గొని బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు. శ్రీ భూలక్ష్మి మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ భూలక్ష్మీ మాత అమ్మవారికి బోనాల సమర్పణ మహోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి, మంగళ వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల శివసత్తుల పూనకాలు, గోవింద నామస్మరణలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. వీరితో పాటు నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, స్థానిక కార్పొరేటర్ స్రవంతి రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, కమిటీ సభ్యులు తోట గోపాల్, మిద్దె రవి, ఆకుల శ్రీశైలం పాల్గొన్నారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ మహోత్సవంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డిఏవి పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి బట్టి






**మణుగూరు (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణు గూరు మండలంలో చిక్కుడు గుంట వద్ద ఉన్న భద్రాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంటును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ లో పనితీరు విద్యుత్ ఉత్పత్తి, ఉత్పత్తిలో వచ్చే లోపాలు ఇబ్బందులను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. బి టి పి ఎస్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన డి ఏ వి పబ్లిక్ స్కూల్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యతోపాటు నాణ్యమైన విద్యను అందించే విధంగా విద్యాసంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు



అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు పాఠశాల భవనం తరగతి గదులను ప్రయోగశాలను గ్రంథాలయాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం లక్ష్యాల గురించి తెలుసుకుని అభినందించారు. పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఏర్పాట్లను ప్రశంసిస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లంవెంకటరావు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జెన్కో సిఎం అండి హరీష్, నవీన్ మెటల్, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రభుత్వ అధికారులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండ్లు పంపిణీ చేసిన గోలి శ్రీనివాసరెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ముఖ్య అతిథిగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కేక్ కటింగ్ చేయడం జరిగింది. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో, మాజీ మున్సిపల్ చైర్మన్ లు శ్రీశైలం, ఎడ్మ సత్యం, కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్, వార్డ్ సభ్యులు కిషోర్, నరేష్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, రమేష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రఘునాధపాలెంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు
### మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేసిన టిఆర్ఎస్ నాయకులు

**ఖమ్మం, (సింగిడి)::** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ ఉద్యమ నిలయం, యువతకు మార్గదర్శి, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఖమ్మం నియోజకవర్గంలోని పరిధిలోని రఘునాధపాలెం మండలం మదర్ తెరిసా మానసిక వికలాంగం కేంద్రంలో అత్యంత వైభవంగా, పండగ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అజ్మీర వీరు నాయక్ నాయకత్వంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు ఈ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అజ్మీర్ వీరు నాయక్ ఉన్నాయి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చడంలో, ఐటీ మరియు పారిశ్రామిక రంగాలలో రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టడంలో కేటీఆర్ పాత్ర చిరస్మరణీయం. స్వయం సమృద్ధి కలిగిన నాయకుడిగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ అసామాన్యం. తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు నిరంతరం ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేటీఆర్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి, సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ప్రజలకు మరింత కాలం సేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పిన్ని కోటేశ్వరరావు, హరి ప్రసాద్, తేజావత్ శంకర్, యాస రామారావు, ప్రదీపు, వెంకటేశ్వర్లు, తార, ప్రసాదు, పెంట్యా, లక్ష్మణ్, మెంటం రామారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ
### అందజేసిన సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండల కేంద్రంలో నివ్ గ్రామ పంచాయతీ సిబ్బందికి శానిటేషన్ కిట్టు, దుస్తువుల పంపిణీ చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఈ కార్యక్రమంలో, ఇంచార్జ్ ఎంపీవో గిరి గౌడ్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు పాలాది మల్లీశ్వరి రంగ నాథం, గుద్దటి కిష్టల్, పసునోజు వాణి పురుషోత్తం, గోసుల కొండల్, ముదికొండ కవిత రమేష్, మసిగుండ్ల వెంకటేష్, మరిపల్లి మంజుల శ్రీను, జంగిలి సునీత ఆనంద్, పిల్లి దేవేందర్, శిరుశనగండ్ల శేఖర్, గోపిరెడ్డి రఘు, రేవల్లి శోభ రాజు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అటవీ శాఖ అధికారిగా రేవంత్ చంద్ర



**గద్వాల బ్యూరో (సింగిడి):** నాగర్ కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రకు వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో శుక్రవారం గద్వాలలోని అటవీ శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది డిఎఫ్ఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు జిల్లాల్లో అటవీ సంరక్షణ, వనమహోత్సవం కార్యక్రమాల అమలు, మొక్కల పెంపకం, సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ తదితర కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ అదనపు బాధ్యతలతో అటవీ శాఖ పనులు మరింత సమన్వయంతో, సమర్థవంతంగా నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు.

### వాతావరణ మార్పులపై రైతులకు
## అవగాహన కల్పించిన ఎంపీడీఓ



**గద్వాలప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా సింధనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎంపీ డీఓ భాస్కర్ పాల్గొని రైతులకు వాతా వరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం, పంటల సాగుపై కలిగే మార్పులను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు, బోర్ రీచార్జ్ పనుల ప్రాధాన్యతను వివరించారు. వి బి జి – ఆర్ ఎ ఎమ్ జి పథకాల ద్వారా చేపట్టే కార్యక్రమాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ పథకాల అమలులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ )లు, జీపీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులును కలిసిన టీపీసీసీ వైస్ ఛైర్మన్

**తల్లాడ, (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ ని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. శుక్రవారం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకం అయిన సందర్భంగా వెంకటేశ్వర్లును ఆయన ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డిసిసి అధ్యక్షులకు వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపా అప్పయ్య, వైరా మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కాపా సుధాకర్ ఉన్నారు.



# తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**పైపులైన్ లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్లపై కట్టడి.. ఎల్ఎండీ నీటి నిల్వలపై నిత్య పర్యవేక్షణకు ఆదేశం: కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, (సింగిడి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, ప్రజారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, నీటి నిల్వలు, వినియోగం, పొదుపు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. పైపులైన్ లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనిచేయని బోర్లను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కొత్తపల్లి--ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంటతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ డెడ్ స్టోరేజ్ పరిస్థితి రాకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి--జంగంపల్లి ప్రాంతాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృత అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్లు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీల ప్రారంభం

**చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు అతిథుల పిలుపు**

**చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చొప్ప దండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ వకాడే, సహాయ కలెక్టర్ పి. హరిప్రసాద్, సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల కేరింతల మధ్య క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించి, ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయని, సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్‌లో క్రీడలకు పెద్దపీట వేస్తూ, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే క్లస్టర్ క్రీడల్లో విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు భరత్ కుమార్, కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, కార్పొరేటర్ వాసాల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు వేముల చంద్రశేఖర్, డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## చేనేత ఉత్పత్తులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

**కులవృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం**

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్**



**జమ్మికుంట (సింగిడి):** చేనేత ఉత్పత్తులను పెంచడం ద్వారా చేనేత వృత్తుల వారికి చేయూత ఇస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చేనేత కుల వృత్తులను ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సమీకృత వస్త్రోత్పత్తి కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కమిటీ వారిని సన్మానించారు. కేంద్రంలో జరుగుతున్న పనులను,దినసరి వేతనం గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం,సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ఉపాధ్యక్షులు తిరుపతయ్య,కోశాధికారి మహదేవ్,కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమే**

## ఉపాధ్యాయులుగా సుధాకర్ సేవలు అభినందనీయం..

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట, (సింగిడి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని సుమారు 40 సంవత్సరాలుగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సుధాకర్ సార్ కు దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి విరమణ పొందుతున్న సుధాకర్ సార్ సేవలను చైర్మన్ అభినందించారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ తన సేవలను వీలైనప్పుడల్లా విద్యార్థులకు అందించాలని తమ అనుభవాలను రాబోయే తరం టీచర్లకు తెలుపుతూ వారి శేష జీవితం ఆనందమయంగా గడపాలని కోరారు. అనంతరం సుధాకర్ ను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ప్రభుత్వ క బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై బీజేవైఎం సమరభేరి

**'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' పోస్టర్ ఆవిష్కరణ.. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని గంగాడి కృష్ణారెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. సుమారు రూ. 15 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. కరీంనగర్ జిల్లాలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేవైఎం ఆధ్వర్యంలో నిరంతర ఆందోళనలు కొనసాగిస్తామని, బకాయిలన్నీ విడుదల చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరెడ్డి, గుజ్జ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నిర్మలా రెడ్డి, నాయకులు సునీత, శశిధర్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాత ఆశయాలను కొనసాగిస్తా.. ప్రజలకు మరింత సేవ చేస్తా..





**వొడితల ప్రణవ్..**

**ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు వర్ధంతి**

**జమ్మికుంట, (సింగిడి):** రాజ్యసభ సభ్యుడిగా,రాజకీయాల్లో ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన మహానుభావుడు వొడితల రాజేశ్వర్ రావు అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు ప్రణవ్. ఈ సంద ర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు,ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హుజురాబాద్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి ప్రణవ్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని,ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని, ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు. వారు చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్మెన్ అంజలి, కౌన్సి లర్లు,దేవాలయాల చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్,బీసీ ఎస్సీ, యువజన, సేవాదళ్, అనుబంధ సంఘాలు, సోషల్ మీడియా, యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో నిరాడంబరంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ, ప్రత్యేక పూజలు, అల్పాహార వితరణ కరీంనగర్, జూలై 24: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని కరీంనగర్ జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలతో నిరాడంబరంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు దూరంగా ఉండి ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. రేగుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏడాదికి సరిపడా నోటుపుస్తకాలు, పెన్నులు, ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. మార్కెట్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కూరగాయల వ్యాపారులు, బాటసారులకు అల్పాహారం పంపిణీ చేశారు. 32వ డివిజన్ హుస్సేనీపురాలోని మదర్సాలో కార్పొరేటర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. అలాగే 33వ డివిజన్‌లో కార్పొరేటర్ జమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు, బలపాలు, కంపాస్ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మైనారిటీ విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి

**బీఎల్‌వోలు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలి అదనపు సిబ్బంది కేటాయింపుపై కమిషనర్‌కు విజ్ఞప్తి**

**కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఒక్క అర్హ ఓటు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా వంద శాతం పూర్తి చేసేలా కాంగ్రెస్ బీఎల్ఏలు, పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్ కాన్పూరా, ప్రియదర్శిని కాలనీ, 54వ డివిజన్ అశోక్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలు, పార్టీ నాయకులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకుని, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంగ్రెస్ నాయకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటర్ల చిరునామాలు, ఫోన్ నంబర్లు గుర్తించడంలో అవసరమైన సహాయం చేయాలని సూచించారు. అదనపు సిబ్బందిని నియమించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు ఒకే ఓటును కొనసాగించేందుకు అవసరమైన గణన పత్రాలను అందించాలని, ఏ ఓటును కొనసాగించాలన్నది పూర్తిగా ఓటరే నిర్ణయించుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి బీఎల్‌వోలకు ఏవైనా సందేహాలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, నిర్లక్ష్యం లేదా అవగాహన లోపం వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని రాజేందర్‌రావు అన్నారు. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ గణన పత్రాల నింపడంలో కాంగ్రెస్ నాయకులు సహకరించి, సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ కమిటీ సభ్యుడు పద్మాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా ఆఫ్రీన్, ఇక్రం సికిందర్, 54వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోవిటి సామ్రాట్, ఖాజా, షహన్‌షా, గండి శ్యామ్, గండి గణేష్, వేల్పుల వెంకటేష్, సముద్రాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

**అన్ని మండపాలకు ఉచిత విద్యుత్, రహదారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: మేయర్ శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరంలో రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లకు అధికారులు చర్యలు ప్రారంభించారు. శుక్ర వారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో మేయర్ ఉత్సవాల ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. వినాయక మండపాలకు వెళ్లే ప్రధాన రహదా రుల్లో గుంతలు పూడ్చడం, అవసరమైన చోట్ల రహదారి మరమ్మ తులు చేపట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని వినాయక మండపా లకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. మండపాల విద్యుత్ బిల్లులను నగరపాలక సంస్థ నిధుల ద్వారా చెల్లించే ప్రతిపాదనను పరిశీలి స్తున్నట్లు వెల్లడించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరిం చుకుని టవర్ సర్కిల్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయ అలంకరణలతో సుందరీకరించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్, మున్సిపల్, పారిశుధ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి బాధ్యతలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం మరియు అన్ని శాఖల సమన్వయంతో ఈసారి వినాయక నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన సౌకర్యాల కల్పనకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఉత్సవాలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా నగరపాలక సంస్థ అన్ని విధాలుగా చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని విద్యార్థి మృతి



**జమ్మికుంట, (సింగిడి):** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన రావి కంటి సుజల్(18) అనే విద్యార్థి తన స్నేహితుడు అబ్బడి అశ్విత్ తో కలిసి జగ్గయ్య పల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ తరుణంలో రెండు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో సుజల్ కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాధితున్ని హన్మకొండ ఆసుపత్రికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రావి కంటి వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## విధి నిర్వహణలో ఆగిన ఫైర్ కానిస్టేబుల్ గుండె



**జమ్మికుంట, (సింగిడి):** పోలీసు విధులు నిర్వహిస్తున్న సమయంలో అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా పని చేస్తున్న ఓ పోలీస్ గుండె ఆగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మోటం అరవింద్(29) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వేళ విధినిర్వహణలో ఉండగా వాకింగ్ చేసేందుకు బయటకు వెళుతున్న తరుణంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి ఉద్యోగులు సి పి ఆర్ చేసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత సంవత్సరం క్రితం వీణవంక మండల కేంద్రానికి చెందిన అరవింద్ కు ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ఓ యువతితో గత తొమ్మిది మాసాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురుని కంటతడి పెట్టించాయి.

## సర్‌పై విస్తృత స్థాయి సమావేశం..



**జమ్మికుంట, (సింగిడి):** రాష్ట్రంలో సమగ్ర ఓటు సవరణ నమోదు ప్రక్రియ(సర్ ) సమయం దగ్గర పడుతున్నా కొద్ది కాంగ్రెస్ పార్టీ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ ల పని తీరుపై,సందేహాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు సుడా మాజీ ఛైర్మెన్,హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమలాపూర్,వీణవంక మండల పరిధిలోని గ్రామాల బిఎల్ఏ,కో ఆర్డినేటర్లుతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు బిఎల్ఏ వద్ద ఉన్న పూర్తి సమాచారం కో ఆర్డినేటర్ల వద్ద ఉందా లేదా అని ప్రశ్నించారు?గ్రామాల్లో ఓటు నమోదు ఫారం రాకపోతే బిఎల్అఓ కో ఆర్డినేటర్లకు తెలపాలని అక్కడ నుండి మాకు చేరవేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్ పై సీరియస్ గా దృష్టి పెట్టింది కావున ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజురాబాద్ కి సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలిపారని తెలిపారు. తెలిసి ఒక్క కూడా వృధా కాకుండా చూడాలని కార్యకర్తలకి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్,వీణవంక మండల నాయకులు,గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశ తలరాత మార్చే శక్తి యువతకే ఉంది..

**యువతపై బిజెపి సర్కార్ దాడి హేయమైన చర్య**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**


**కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన**



**జమ్మికుంట (సింగిడి):** : ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర బీజేపీ సర్కార్ కొనసాగిస్తున్న అణచివేత కు నిరసనగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువతతో పెట్టుకుంటే దేశాలే సర్వనాశనం అయ్యాయని అన్యాయంగా విద్యా ర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నది కేంద్ర ప్రభుత్వమని మండిపడ్డారు. యువత విద్యార్థుల స్వరం మారుతోంది నవతరం మేల్కొంటుందని ఈ తరం యువకులు సీబీఐ, ఈడీ, ఐటీ బెదిరింపులకు భయపడదని విద్యార్థులు కోరేది అధికారం కాదు న్యాయం, భవిష్యత్తు మాత్రమే 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను మోసం చేశారని అన్నారు. మేక్ ఇన్ ఇండియా అని చెబుతూ లీక్ ఇన్ ఇండియా గా మార్చారని ఇది రాజకీయ కార్యక్రమం కాదని విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పై కేసులు వెంటనే ఎత్తివేయాలని భవిష్యత్ నిర్మాతలైన యువత కు కేంద్రం జవాబు చెప్పాల్సిందే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురేష్ మంద రాజేష్ పొన్నగంటి రాము మైనార్టీ నేత జానీ టిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ తదితరులు పాల్గొన్నారు...

## చెత్త బయట వేస్తే అపరాధ రుసుము

**మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, (సింగిడి):** మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక స్వీట్ హౌస్ మరియు ఒక కిరాణా దుకాణం యాజమాన్యాలు తమ వ్యాపార సంస్థల చెత్తను రోడ్డుపై వేయడం గుర్తించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయా రెండు వ్యాపార సంస్థలకు రూ. 1,000 చొప్పున అపరాధ రుసుము విధించారు. వ్యాపారులు తమ దుకాణాల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనానికే అందజేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు కె. కిరణ్, దొడ్డ సంపత్ పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
26-7-2026

# నీట్ అక్రమాలపై విద్యార్థుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

**నిర్బంధాలతో గొంతు నొక్కలేరు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని ప్రభుత్వాలకు హెచ్చరిక**

**ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు**



**కరీంనగర్, (సింగిడి):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శుక్రవారం కరీంనగర్‌లో దేశవ్యాప్త విద్యార్థుల నిరసనలకు సంఘీభావంగా నిర్వహించిన విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల కలలు ప్రశ్నాపత్రాల లీకేజీలతో దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల వల్ల పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పరీక్షలో జరిగిన లోపం మాత్రమే కాకుండా దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతకు మచ్చగా మిగిలిందన్నారు. నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా విధానం కోసం ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఖండించారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఫీజు తిరిగి చెల్లింపు, వసతి భత్యాలు, ఉపకార వేతనాలు సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు నిరుద్యోగ యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర అసంతృప్తి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, పరిస్థితిని దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించే సంఘవ్యతిరేక శక్తుల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కన్నం లక్ష్మణ్, కూరతోట సురేందర్, కల్వకుంట్ల వంశీధర్‌రావు, బండ సుధాకర్‌రెడ్డి, జనగామ కరుణాకర్‌రావు, పిన్నింటి లక్ష్మణ్‌కుమార్, జంపాల బాబు, పోల్సాని సునీల్, కనపర్తి సాయి, మిరుదొడ్డి అనిల్, భరత్, మంద మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం సుపారీ.. కాల్పుల కేసు ఛేదన..

**– యూపీ నుంచి నాటు పిస్టల్ తెప్పించి హత్యాయత్నం.. నలుగురు అరెస్ట్**






**మెట్ పల్లి (సింగిడి):** జగిత్యాల జిల్లా. మెట్ పల్లి పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన కాల్పుల ఘటన వెనుక ఆస్తి వివాదమే కారణమని జగిత్యాల జిల్లా పోలీసులు వెల్లడించారు. సొంత అన్న భార్యను హత్య చేయించేందుకు ముందస్తు పథకం ప్రకారం సుపారీ ఇచ్చి, ఉత్తరప్రదేశ్ నుంచి నాటు పిస్టల్ తెప్పించి కాల్పులకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక నాటు పిస్టల్, రెండు సజీవ కార్ట్రిడ్జీలు, హోండా పాషన్ ప్రో మోటార్ సైకిల్, ఐఫోన్--11 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎ. రాములు, సీఐ బి. సురేష్‌బాబు కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, మొబైల్ కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలు, శాస్త్రీయ ఆధారాలను విశ్లేషించి కేసును ఛేదించినట్లు తెలిపారు. పోచమ్మవాడకు చెందిన గోనెల శంకర్ అలియాస్ జేసీబీ శంకర్‌కు తన సోదరుడు రాజం కుటుంబంతో వ్యవసాయ భూమి, ఇంటి ఆస్తికి సంబంధించి చాలా కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజం భార్య గోనెల లక్ష్మిని అడ్డుగా భావించిన శంకర్, అతని భార్య అనూష, బంధువు గోపి ముత్తయ్య కలిసి ఆమెను హత్య చేయాలని కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ఈ కుట్రలో భాగంగా తమ వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌కు చెందిన సచిన్ కుమార్ అలియాస్ సచిన్ వర్మను డబ్బు, సౌదీ అరేబియాకు పంపిస్తామనే హామీతో ప్రలోభపెట్టి హత్యకు ఒప్పించారు. అనంతరం అతను ఉత్తరప్రదేశ్‌లో రూ. 40 వేలతో నాటు పిస్టల్, మూడు కార్ట్రిడ్జీలు కొనుగోలు చేసి మెట్‌పల్లికి తీసుకొచ్చినట్లు దర్యాప్తులో తేలింది. జూన్ 15 అర్ధరాత్రి ముఖానికి రుమాలు కట్టుకుని హోండా పాషన్ ప్రో బైక్‌పై లక్ష్మి ఇంటి వద్దకు వెళ్లిన సచిన్, వరండాలో నిద్రిస్తున్న ఆమెపై కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ లక్ష్యాన్ని తప్పి ఎడమ చెంపను తాకడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. అనంతరం ఘటనను గుర్తుతెలియని వ్యక్తుల దాడిగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలికి చికిత్స సమయంలో ముఖం నుంచి బుల్లెట్ బయటపడటంతో కేసు దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, మొబైల్ ఫోన్ విశ్లేషణ, ఆర్థిక లావాదేవీలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి హత్య కుట్రను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో గోనెల శంకర్, గోనెల అనూష, గోపి ముత్తయ్యలను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ప్రధాన నిందితుడు సచిన్ కుమార్‌ను ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై మెట్‌పల్లికి తీసుకొచ్చి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించిన సీఐ బి. సురేష్‌బాబు, ఎస్ఐ పి. కిరణ్‌కుమార్‌తో పాటు దర్యాప్తు బృందాన్ని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.


## ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న బీఆర్ఎస్ 19వ వార్డు ఇంచార్జి ఆకుల ప్రవీణ్



**మెట్‌పల్లి, (సింగిడి):** : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి పట్టణ 19వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, న్యాయవాది ఆకుల ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తును సమర్పించిన ఆయన అనంతరం మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిలాంటిదని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఇంటింటికి వచ్చే బూత్ స్థాయి అధికారులకు అవసరమైన ధ్రువపత్రాలు, వివరాలను అందజేసి ఎస్ఐఆర్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ప్రజలను కోరారు.
అలాగే ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని, ఏవైనా లోపాలు లేదా తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు తన బాధ్యతను నిర్వర్తించాలని ఆకుల ప్రవీణ్ పిలుపునిచ్చారు.

## ముగిసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

**భక్తిశ్రద్ధలతో కాలనీవాసుల సామూహిక భాగస్వామ్యం**



**కరీంనగర్, (సింగిడి):** గాయత్రీనగర్, రోడ్ నెం. 1లో శ్రీ రాకేష్ శర్మ అయ్యవారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం తో ఘనంగా ముగిసినవి . తొమ్మిది రోజులుగా కొనసాగిన ఈ ఉత్సవాల్లో గాయత్రీనగర్ కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీవాసులందరి సహకారంతో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించిన నిర్వాహకులు, ముగింపు కార్యక్రమంలో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. . చివరి రోజు కార్యక్రమం లో నిర్వాహకులు మేస్త్రి శ్రీనివాస్, కచ్చాకాయల రాజేంద్ర ప్రసాద్, బైరి శ్రీనివాస్, కాసార్ల శ్రీనివాస్, శెట్టి ప్రకాష్, డా రామూర్తి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్కన్నపేట మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



**హుస్నాబాద్ (సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బంద్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాండ్రాల దాము మాట్లాడుతూ విద్యార్థుల కష్టార్జిత శ్రమను నీరుగార్చే విధంగా జరిగిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దేశ విద్యా వ్యవస్థకు మచ్చ తెచ్చిందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని, కేంద్ర ప్రభుత్వం బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. అక్కన్నపేట మండల ఎన్ఎస్‌యూఐ నాయకుడు బొమ్మ అభిలాష్ మాట్లాడుతూ విద్యార్థుల ఆశయాలను దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త పంగ రాకేష్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా అక్కన్నపేట మండలంలో బంద్‌ను విజయవంతం చేశామని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ సంయుక్తంగా నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జన్నారపు సంపత్, బందారం శ్రీనివాస్, జరుపుల సునీత రాజు, ఉపసర్పంచ్ లింగాల కానుకయ్య, చౌకం గణేష్, వార్డు సభ్యుడు మునిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బందారం రాజయ్య, స్వామిరెడ్డి, ఎం.డి. బషీర్, లింగాల రాజు, సంతోష్, సంపత్, సతీష్, పరశురాములు తదితరులు పాల్గొని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనేలా చేసి విద్యార్థుల సమస్యల పట్ల తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శిగా విజయ్ నియామకం...



**మెట్ పల్లి, (సింగిడి):** భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) మెట్‌పల్లి పట్టణ ప్రధాన కార్యదర్శిగా భీమనాథి విజయ్‌ను నియమించారు. ఈ విషయాన్ని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు గోపనవేణి రమేష్ యాదవ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భీమనాథి విజయ్‌కు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు యువత సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా భీమనాథి విజయ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కమిటీ నిర్ణయాల మేరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేపట్టి, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయ్‌కు అభినందనలు తెలిపారు.

## శుక్రవారం వస్తే వాహనదారులకు చుక్కలే..!

**ప్రధాన రహదారులపైనే తోపుడు బండ్లు..**

**రోడ్లపైనే అక్రమ పార్కింగ్..**


**సాయంత్రం వేళ ట్రాఫిక్‌తో నరకయాతన.. శుక్రవారం**

**ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణకు ప్రజల డిమాండ్..**



**హుస్నాబాద్(సింగిడి):** హుస్నాబాద్ పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే వారసంత వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వివిధ జిల్లాల నుంచి వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు పూర్తిగా రద్దీగా మారుతున్నాయి. వ్యాపారులు ప్రధాన రహదారులపైనే తోపుడు బండ్లు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహించడం, కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే అడ్డదిడ్డంగా పార్క్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా అంబేద్కర్ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తా వద్ద పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఈ మార్గం జనగాం, సూర్యాపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే శుక్రవారం రోజున ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తుండగా, సాయంత్రం సమయానికి వారసంతకు వచ్చే ప్రజల సంఖ్య మరింత పెరగడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అత్యవసర సేవలకు సంబంధించిన అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితి ఏర్పడుతుండగా, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై తోపుడు బండ్లు, అక్రమ పార్కింగ్ కారణంగా చిన్నపాటి రోడ్డు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి శుక్రవారం వారసంత సందర్భంగా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి, అదనపు ట్రాఫిక్ పోలీసులను నియమించి, ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, ప్రధాన రహదారులపై తోపుడు బండ్లను నియంత్రించడం, అక్రమ పార్కింగ్‌ను అరికట్టడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో బి ఎల్ వో ఇన్చార్జి రాయల రాము



**తల్లాడ,(సింగిడి):** తల్లాడ పట్టణానికి చెందిన మైసరావు కృష్ణవేణి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం తల్లాడ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి నియోజకవర్గ బిఎల్‌వో ఇంచార్జ్ రాయల రాము పాల్గొ న్నారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల రాము మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా మంత్రుల సహకారంతో సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో మరిన్ని ఇంది రమ్మ ఇండ్లు తల్లాడ పట్టణానికి వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు దగ్గుల శ్రీనివాస్ రెడ్డి,అయినాల నరసింహారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్..

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్**






**హుస్నాబాద్ (సింగిడి):** రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఘటనను నిరసిస్తూ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని ఖండిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పాఠశాలలు, కళాశాలలు బంద్ విజయవంతంగా నిర్వహించినట్లు ఎన్ఎస్‌యూఐ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యావ్యవస్థ పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని, ప్రశ్నపత్రం లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతూ ప్రతి విద్యార్థి పక్షాన ఎన్ఎస్‌యూఐ నిలుస్తుందని స్పష్టం చేశారు.
కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, రాజీనామా జరిగే వరకు మరియు విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.
కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే భారతీయ జనతా పార్టీ మంత్రులు, నాయకులు ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థి పక్షాన నిలుస్తామని, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కూన విశ్వతేజ, ఉపాధ్యక్షుడు రాకేష్, నిజాం కళాశాల ఉపాధ్యక్షుడు పున్న రంజిత్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్, యువజన కాంగ్రెస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, ఎన్ఎస్‌యూఐ నాయకులు గడిపే రాహుల్, రజినీకార్, రాహుల్, ఇతర మండలాల నాయకులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలి:

**తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్**



**హుస్నాబాద్, (సింగిడి):** ఛత్రపతి సాహుజి మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు గౌరవ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ముఖ్య అతిథిగా హాజరవుతారని, సీనియర్ న్యాయవాది చెక్కుడు ప్రభాకర్, తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పెనుముల జగన్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది డాక్టర్ కదిరి కృష్ణ, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్, డాక్టర్ బెల్లయ్య నాయక్ తదితరులు వక్తలుగా పాల్గొని పూలే, ఛత్రపతి సాహుజి మహారాజ్, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, బీసీ వర్గాల సాధికారత, రిజర్వేషన్ల ప్రాధాన్యం, దళిత క్రైస్తవుల సమస్యలు, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారని తెలిపారు. గత దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దళిత, బడుగు బలహీన వర్గాలపై దాడులు, వివక్ష, హత్యలు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1902లో దేశంలోనే తొలిసారిగా వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఛత్రపతి సాహుజి మహారాజ్ సేవలు చారిత్రాత్మకమని, అనంతరం డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ రక్షణ కల్పించారని గుర్తు చేశారు. నేడు బహుజన వర్గాలు విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో పురోగతి సాధించడానికి సాహుజి మహారాజ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు, కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే రిజర్వేషన్ డే సభలో
బీసీ వర్గాల విముక్తి, ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్లు, దళిత క్రైస్తవుల సమస్యలు తదితర అంశాలపై లోతైన చర్చ జరుగుతుందని, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న, మల్లంపల్లి మాజీ ఎంపీటీసీ మ్యాక రమేష్, గాంధీనగర్ మాజీ సర్పంచ్ కోతి రామచంద్రం, అంబేద్కర్ నాయకుడు పొన్నాల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 27న జర్నలిస్టుల ఛలో పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



**జమ్మికుంట, (సింగిడి):** కంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు పిలుపునిచ్చారు. శుక్రవారం హుజరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఛలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించడం, జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని పార్లమెంట్‌లో తీసుకురావడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడం వంటి ప్రధాన డిమాండ్లపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు.
దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న 50 శాతం రైల్వే ప్రయాణ రాయితీని కోవిడ్ సమయంలో నిలిపివేశారని, ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో వేలాది మంది పాత్రికేయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సౌకర్యాన్ని వెంటనే తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా రంగం విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.
అలాగే పలు రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒకే విధమైన జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించడంతో పాటు పాత్రికేయ సంఘాలు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపుపై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. బీసీ జేఏసీ అధ్యక్షులు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు టి డబ్ల్యూ జేఎఫ్ చేస్తున్న ధర్నాకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సౌడమల్ల యోహాన్, నాయకులు రాఘవుల శ్రీనివాసు, రాజేంద్రప్రసాద్, ఇప్పకాయల సాగర్, శంకర్, శ్రీనివాస్, రవీందర్, కొండ గణేష్, వెంకన్న, కొలిపాక క్రాంతికుమార్, మామునూరి ప్రవీణ్ కుమార్, సంగం సత్యనారాయణ, శ్రీనివాస్, సంగం శ్రీనివాస్, సొల్లు శంకర్, కొక్కుల రవీందర్, పిట్ట శ్రీనివాస్, గొల్లపల్లి రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

# పీజీ విద్యార్థిని అపార్ట్మెంట్ పై నుండి దూకి ఆత్మహత్య



**కీసర, (సింగిడి):** కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారంలో విషాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎంబిబిఎస్ పూర్తి చేసి, బెంగుళూరులో సిద్దార్థ కళాశాలలో పీజీ చేస్తున్న విద్యార్థిని దీక్షిత 26 సం"లు ఆత్మహత్య చేసుకుంది. గత వారం నాగారం లోని వెస్ట్ గాంధీనగర్లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చిన దీక్షిత, మధ్యాహ్నం అపార్ట్మెంట్ పై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే సమీపంలో ఉన్న విజయ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి స్వస్థలం యాదాద్రి జిల్లా బొమ్మల రామారాం , మైలారం గ్రామం , నాగారంలో స్థిరపడ్డారు. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 26-7-2026

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి:
### బీజేపీ మండల అధ్యక్షుడు మేడవేణి శ్రీధర్




**బుగ్గారం, (సింగిడి):** బుగ్గారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బుగ్గారం మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ బుగ్గారం మండల ఇన్‌చార్జ్ కట్ట మహేష్ హాజరుకాగా, ముఖ్య అతిథిగా కొమ్ము రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మేడవేణి శ్రీధర్ మాట్లాడుతూ, బుగ్గారం మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. అనంతరం ముఖ్య నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ పై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

బీజేపీలో నూతన చేరికలు..

ఈ కార్యవర్గ సమావేశంలో విలాసాగరం వంశీతో పాటు పలువురు బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో నూతనంగా చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథి కొమ్ము రాంబాబు, మండల ఇన్‌చార్జ్ కట్ట మహేష్‌ను మండల అధ్యక్షుడు మేడవేణి శ్రీధర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దొనకంటి అనిల్, ఉపాధ్యక్షులు కప్పల నరేష్, కప్పల మల్లేష్, సుంకం ప్రశాంత్, సుంకం గంగారెడ్డి, సాన మల్లేశం, బరతపు సంజు, చేనవేణి మల్లేష్, వెంకటేష్ తదితర మండల నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బీరంగూడ నుండి ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వరకు
## BRSV భారీ బైక్ ర్యాలీ



### ప్రత్యేక ఆకర్షణగా నందారం నరసింహ గౌడ్ నాయకత్వం!

**అమీన్ పూర్, (సింగిడి):** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (BRSV) ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు బీరంగూడ డివిజన్ నుండి అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నందారం నరసింహ గౌడ్ ప్రత్యేక వ్యూహంతో, భారీ జనసందోహంతో కదిలి వెళ్లారు. ఆయన నాయకత్వంలో వందలాది వాహనాలతో సాగిన ఈ ర్యాలీ ధర్నా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పటాన్చెరు నియోజకవర్గ ప్రజానాయకులు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి ఆశీసులు మరియు ప్రత్యక్ష ఆదేశాల మేరకు నందారం నరసింహ గౌడ్ ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు. బీరంగూడ నుండి ఇందిరా పార్క్ వరకు సుమారు 400 నుండి 500 మందికి పైగా యువకులు, దీ=ూఎ కార్యకర్తలు కార్లు, బైకులతో భారీ కాన్వాయ్‌గా కదిలి ప్రభుత్వానికి తమ నిరసన గళాన్ని గట్టిగా వినిపించారు. ఈ భారీ బైక్ ర్యాలీకి అడుగడుగునా నాయకులు నందారం నరసింహ గౌడ్ నాయకత్వ ప్రతిభ స్పష్టంగా కనిపించింది. కార్యకర్తలను సమన్వయం చేస్తూ, స్వయంగా ముందుండి నడిపించిన ఆయన.. స్థానిక యువతలో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. "ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి వెన్నంటి ఉంటూ, విద్యార్థి, యువజన సంక్షేమం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం దీ=ూ శ్రేణులు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నరసింహ గౌడ్ చేపట్టిన ఈ భారీ శక్తి ప్రదర్శన పటాన్చెరు రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

### గర్రెపల్లి సింగిల్ విండో పగ్గాలు కల్లేపల్లి జాని చేతికి....
## రైతు సంక్షేమానికి కొత్త ఊపు...
### చైర్మన్ గా బాధ్యతల స్వీకారం....



**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథ మిక వ్యవసాయ సహకార సం ఘం (సింగిల్ విండో) నూతన చైర్మన్‌గా కల్లెపల్లి జానీ శుక్రవారం పాల కవర్గ సభ్యులతో కలిసి ఘనంగా బాధ్యతలు స్వీకరిం చారు. సంఘం సీఈవో నబీద్దీన్ శాలు వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం వివిధ గ్రామాల సర్పంచులు, మాజీసర్పం చులు, ప్రజా ప్రతినిధులు నూతన చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే తమ ప్రధానలక్ష్యమని నూతన చైర్మన్ కల్లెపల్లి జానీ పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గం సమిష్టిగా కృషిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో వైస్ చైర్మన్ బండారి రమేష్‌తో పాటు పాలకమండలి సభ్యులు చిగురు రాజశేఖర్ రెడ్డి, ఎర్రంరాజిరెడ్డి, ఆసరి రమా, దాసరి రాజిరెడ్డి, కొము రవెల్లి చక్రధర్, మిరియాల సరోజన, పోచంపల్లి రాజు, పోతర వేణి తిరుపతి, రాయిల్ల.రాజమల్లు, తిప్పారపు స్వరూప, బిజిలి పెద్ద రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా పలువురు నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్
### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
### లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ



**పటాన్చెరు, (సింగిడి):** ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీ నగర్ డివిజన్ బాంబే కాలనీకి చెందిన వలిగొండ ముత్యాలు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్ పై ఎమ్మెల్యే మందుల సామేల్ ఫైర్



**కోదాడ (సింగిడి):** నా సొంత నియోజకవర్గంలో కోమటిరెడ్డి బ్రదర్స్ జోక్యం చేసుకోవడం ఏమిటని తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ మండిపడ్డారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గంలో ఆర్అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేగా తనకు ప్రోటోకాల్ మేరకు ఆహ్వానం లేకపోవడం పట్ల మందుల సామేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి కోమటిరెడ్డి బ్రదర్స్ పై నిప్పులు చెరిగారు. నాకు తెలియకుండా నా నియోజకవర్గంలో మొన్న మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నేడు మంత్రి వెంకట్ రెడ్డి పర్యటించారని..సొంత పార్టీ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా..ఎస్సీ ఎమ్మెల్యే అయన నన్ను కావాలనే వారు అవమానిస్తున్నారని సామేల్ ఆరోపించారు. ప్రోటోకాల్ కు విరుద్ధంగా శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి వెంకట్ రెడ్డికి మతిస్థిమితం లేకుండా పోయిందని మండిపడ్డారు.

**రాహుల్, ఖర్గేలకు ఫిర్యాదు చేస్తా..**

కోమటిరెడ్డి బ్రదర్స్ కు ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల అంటే లెక్కలేకుండా పోయిందని, చిన్నచూపు చూస్తున్నారని సామేల్ విమర్శించారు. నా నియోజకవర్గంలోని మోత్కుర్ లో రెండు కిలోమీటర్ల రోడ్డు కోసం వంద సార్లు మంత్రి వెంకట్ రెడ్డి చుట్టు తిరిగినా పని చేయలేదని దుయ్యబట్టారు. మాదిగలు అంటే మీకు బానిసలు కాదని, తుంగతుర్తిలో నన్ను, నకిరేకల్ లో వేముల వీరేశంను పదేపదే చిన్నచూపు చూస్తూ అవమానిస్తున్నారన్నారు. ఎస్సీ నియోజకవర్గాల ఎమ్మెల్యేల పట్ల పార్టీ విధానం ఇదేనా అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ను, ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ను, సీఎం రేవంత్ రెడ్డిని, భట్టి విక్రమార్కను అడుగుతున్నానని..వారు కోమటిరెడ్డి బ్రదర్స్ వైఖరిపై స్పందించాలన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా కోమటిరెడ్డి బ్రదర్స్ సాగిస్తున్న పెత్తందారి రాజకీయాలపైన రాహుల్ గాంధీకి, ఖర్గేకు ఫిర్యాదు చేస్తానని సామేల్ ప్రకటించారు. నేను ఎవరికి భయపడే వ్యక్తిని కాదని, కేవలం నన్ను గెలిపించిన నా తుంగతుర్తి నియోజకవర్గం ప్రజలకు మాత్రమే భయపడుతానని సామేల్ స్పష్టం చేశారు.

మాదిగలను అవమానిస్తే తగిన సమాధానం చెబుతా

వేముల వీరేశం నకిరేకల్ లో 68వేల ఓట్లతో, తుంగతుర్తిలో 52వేల ఓట్ల మెజార్టీతో గెలిచామని, మేం మీ వద్ద చేయి చాపలేదని సామేల్ గుర్తు చేశారు. తుంగతుర్తి, నకిరేకల్ లో బాగలేదని, పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని గాంధీభవన్ లో రాజగోపాల్ రెడ్డి మాట్లాడారని, ముందుగా మీ నియోజకవర్గాల్లో మీ సక్కదనం ఏందో ముందు కోమటిరెడ్డి బ్రదర్స్ చూసుకోవాలన్నారు. నల్లగొండ జిల్లా అంటే పోరాటాల గడ్డ అని, దళిత, గిరిజన, బలహీన వర్గాల బిడ్డలు ఉద్యమించిన జిల్లా అని.. ఈ జిల్లా మీ రాజ్యం కాదని, శ్రమజీవుల జిల్లా అని, ఈ పోరాటాల గడ్డలో తెలంగాణ పోరుబిడ్డ మందుల సామేల్ ఉంటాడని గుర్తు పెట్టుకోవాలన్నారు. అణగారిన వర్గాలను చిన్నచూపు చూస్తే అందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ కు నేను సమాధానం చెబుతానన్నారు. +వశీస్త్రతీఖజూష్ట్రఅషె=వటవతీవఅషెవ

రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో మీ పెత్తనం ఏంది..?

బీజేపీలోకి రాజగోపాల్ రెడ్డి ఎందుకుపోయి పోటీ చేశాడో ముందుగా పార్టీ కార్యకర్తలకు జవాబు చెప్పాలని, రాహుల్ గాంధీని, సోనియాగాంధీని తిట్టాడని, మళ్లీ వచ్చి కాంగ్రెస్ లో చేరి పోటీ చేసి గెలిచి..మా నిఖార్సైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందంటూ మాట్లాడుతున్నాడని..అలాగైతే ఇక్కడున్న సర్పంచ్ లు, నాయకులు అంతా ఎవరని సామేల్ ప్రశ్నించారు. మా నియోజకవర్గంలో మీ పెత్తనం ఎందని, మీ జులూం ఎందని కోమటిరెడ్డి బ్రదర్స్ ను ప్రశ్నించారు. అంబేద్కర్ రాజ్యాంగం మేరకు మాకు పోటీ చేసే అవకాశం వచ్చిందని, ఉద్యమ బిడ్డగా నా నియోజకవర్గం ప్రజలు నన్ను ఆదరించి గెలిపించారన్నారు. బీసీలకు కులగణనతో 52శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనపైన, సంక్షేమ పథకాలపైన ఒక్కనాడైనా సానుకూలంగా కోమటిరెడ్డి బ్రదర్స్ మాట్లాడరని విమర్శించారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయ జీవితానికి సమాధి కడుతా

జిల్లాలో మా ఎస్సీ ఎమ్మెల్యేల హక్కులను హరించే ప్రయత్నం మానుకోకపోతే మీ రాజకీయ జీవితానికి సమాధి చేసేందుకు దండోరా మోగిస్తానని సామేల్ హెచ్చరించారు. చావులకు, సంబురాలకు డప్పు కొట్టేది మేమే అని..మీ వైఖరి మారకపోతే మీపై సమరానికి డప్పు కొట్టక తప్పదన్నారు. నా నియోజవర్గంలో తొమ్మిది మండలాల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను ఆపేందుకు మీకు ఎవరు అధికారం ఇచ్చారని, మీకు ఏం హక్కు ఉందని సామేల్ ప్రశ్నించారు. అసెంబ్లీలో అడుగు పెట్టే దమ్ము మాకు కూడా ఉందని, మా సీట్లపై మీ పెత్తనం ఎందంటూ కోమటిరెడ్డి బ్రదర్స్ పై నిప్పులు చెరిగారు.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వొద్దు

రాహుల్ గాంధీని ప్రధాని చేస్తామని కోమటిరెడ్డి బ్రదర్స్ మాట్లాడుతున్నారని, వారు చేస్తే ప్రధాని కారని, మాదిగలు, లంబాడాలు, ఆదివాసీలు, గిరిజనులు, యాదవులు, రైతులు అంతా కాంగ్రెస్ ఓటు వేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని, రేపు వాళ్లే మళ్లా కాంగ్రెస్ కు ఓట్లేసి రాహుల్ ను ప్రధాని చేస్తారని సామేల్ స్పష్టం చేశారు. తెలంగాణ కేబినెట్ లో మిగిలిన రెండు మంత్రి పదవుల్లో ఒకటి లంబాడా ఎమ్మెల్యేకు, ఇంకోటి యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు ఇచ్చి పార్టీ బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న ఆ వర్గాలకు న్యాయం చేయాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నానన్నారు. పార్టీ మారి వచ్చిన రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వొద్దన్నారు. +వశీస్త్రతీఖజూష్ట్రఅషె=వటవతీవఅషెవ

నిన్న ఎంపీ చామల,సర్వోత్తం రెడ్డిలతో పోరు..
నేడు కోమటిరెడ్డి బ్రదర్స్ పై ఫైర్

తుంగతుర్తి నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల కాంగ్రెస్ అధ్యక్షులను ఎమ్మెల్యేగా మందుల సామేల్ ఎంపిక చేశారు. అయితే బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారికే పెద్దపీట వేశారంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తంరెడ్డిలు అసమ్మతి లేవదీశారు. సామేల్ తీరుపై పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు చామల, కోమటిరెడ్డి బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సామేల్ లతో వేర్వేరుగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందంటూ రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వివాదం ఇలా ఉండగానే కోమటిరెడ్డి బ్రదర్స్ సామేల్ కు తెలియకుండా తుంగతుర్తి నియోజకవర్గంలో పర్యటించడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. దీంతో కోమటిరెడ్డి బ్రదర్స్ తో తాడోపేడో తేల్చుకునేందుకు సామేల్ సిద్ధపడినట్లుగా భావిస్తున్నారు.

# ధర్నా చౌక్ కి కదిలిన పటాన్చెరు యువతరం..

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో 300కు పైగా వాహనాలతో భారీ ర్యాలీ..పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..

**పటాన్చెరు, (సింగిడి):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ.. ప్రశ్నించిన వారిపై దమనకాండ కొనసాగిస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి లోకానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా శుక్రవారం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ధర్నా చౌక్ లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాదిమంది విద్యార్థులు, యువకులు ద్విచక్ర వాహనాలు, 300 పైగా కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. గత 12 సంవత్సరాల ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 158 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. నీట్ వంటి కీలకమైన జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం మూలంగా లక్షలాది మంది



విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరులో పారదర్శకత కరువైందని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో న్యాయం చేయాలంటూ లక్షలాదిమంది విద్యార్థులు ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా శాంతియుత నిరసన ప్రదర్శనలు చేపడుతుంటే.. అత్యంత పాషవికంగా లాఠీచార్జీలు,



టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ కేంద్ర ప్రభుత్వం నియంత పరిపాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రశ్నించడమే నేరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ గా బదిలీ పై వెళ్లిన కొండపల్లి శ్రీదేవి
### ఘనంగా సన్మానించిన మండల పరిషత్ అధికారులు








తల్లాడ, **(సింగిడి):** తల్లాడ మండల కేంద్రం లో గత ఐదు సంవత్సరాల నుండి ఎంపీవో గా విధులు నిర్వహిస్తు అధికార బదిలీలో భాగంగా ఎంపీడీఓ గా ప్రమోషన్ వచ్చి భద్రాద్రి కొత్తగూడెం డిస్టిక్ టేకులగూడెం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ గా వెళ్లిన కొండపల్లి శ్రీదేవి ని శుక్రవారం తల్లాడ మండల పరిషత్ కార్యాలయం లో అధికారులు, సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ అంబటి శ్రీధర్ రాజు, సెక్రటరీ లు ప్రసాద్, శ్రీను, పానకాలు, ప్రశాంత్, రాంబాబు, నవీన్, వేణు, రమేష్, రాజ్యలక్ష్మి, మైబుబి, వెంకట లక్ష్మీ, హారతి, మండల పరిషత్ సిబ్బంది మధు, వాణిశ్రీ, రాజు ఆపరేటర్లు రామారావు శ్రీకాంత్ నరేష్ లు పాల్గొన్నారు...

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..
### ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
### మెట్ పల్లి గురుకులం, డబ్బా మిషన్ భగీరథ గ్రిడ్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్...

**మెట్ పల్లి (సింగిడి):** విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని జగిత్యాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజగౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెట్‌పల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలను సందర్శించిన ఆయన వంటశాలను పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, భోజన తయారీ విధానాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భోజన నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించిన ఆయన స్పష్టమైన లక్ష్యంతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ విజయానికి పునాదులని పేర్కొంటూ ఉన్నత విద్యపై దృష్టి సారించాలని





ప్రోత్సహించారు. తదుపరి ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్‌ను సందర్శించి తాగునీటి శుద్ధి, సరఫరా వ్యవస్థను పరిశీలించారు. నీటి నాణ్యత పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎల్లప్పుడూ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. నిర్వహణలో లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఏర్దండి గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ లింబాద్రి, మిషన్ భగీరథ ఈఈ జానకి, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్, ఎంపీఓ రామకృష్ణరాజు, కళాశాల ప్రిన్సిపాల్, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**కొల్చారం (సింగిడి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం కేంద్రంలో ని ప్రధాన రహదారి పై కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ జన్మదిన సందర్భంగా ప్రధాన రహదారి 76 5 డి పై బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి టపాసులు పేల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో కొల్చారం యువత బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు వనమాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో కొల్చారం బి ఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ గౌడ్ కొల్చారం ఉప సర్పంచ్ కొరంపల్లి రాణి గోపి మాజీ సర్పంచ్ కరెంటు రాజా గౌడ్ సొసైటీ చైర్మన్ మనోహర్ కొల్చారం గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు సాతల్లి చేతులు నేరెళ్ల సత్యనారాయణ కృష్ణ గడ్డం యాదగిరి భద్ర పాండ్ర శ్రీనివాస్ మ్యాదరి సత్యనారాయణ భద్ర వరిగుంతం సంతోష్ గ్యాస్ కృష్ణ చిన్న రాములు చెన్నయ్య తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండనీయం
### కేంద్ర విద్యా శాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలి
### ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తాండ్ర గౌతం సాహూ




**సుల్తానాబాద్, (సింగిడి):** రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా శుక్ర వారం సుల్తానాబాద్ మండలంలో ఎస్ఎఫ్ఐ, ఏ ఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళా శాలల బంద్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అ ధ్యక్షుడు తాండ్ర గౌతం సాహూ మాట్లాడుతూ, వి ద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియు తంగా ఆందోళన చేస్తున్న వారి పై కేంద్ర బలగాలతో లారీ చార్జ్ చేయడం ప్రజా స్వామ్య విరుద్ధమని ఖండించారు. 22 లక్షల మంది వి ద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధా న్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్చేశా రు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, రాజు, అరవింద్, మణి, దినేష్, రిషి, చరణ్, ఏఐ ఎస్ఎఫ్ నాయకుడు పల్లె శ్రీహర్ష తదితరులు పా ల్గొన్నారు.

### కేజీబీవీ భూపతిపూర్ లో
## స్పాట్ అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్.....
### సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో 15 సీట్లు ఖాళీ...
### స్పెషల్ ఆఫీసర్ ఎం సప్న...



**సుల్తానాబాద్, (సింగిడి)::** సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని కస్తూ ర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో ఇం టర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న 15 స్పాట్ అడ్మిషన్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎం. స్వప్న తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని ఆమె సూచించారు. ఆసక్తి గల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అడ్మిషన్ల కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 98494 90479 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వి ద్యార్థినులు ఉన్నత విద్యలో అడుగు పెట్టాలని స్పెషల్ ఆఫీసర్ కోరారు.



సక్సెస్ టాక్‌లో

# చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నం బూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది.

ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటు



న్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. నిర్మాత ధీరజ్ మొగిల్నేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.

సిన్మా సింగిడి Cinma Singidi

ఆదివారం
26-7-2026

హాలీవుడ్ సినిమాలకు దీటుగా

# రామాయణ

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా. ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.



సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న

# నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం. 47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు.



ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




అర్థవంతమైన

# పాత్రలుంటేనే చేస్తా..

## నిధి అగర్వాల్

సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090